

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని
కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు
ఉన్నప్పటికీ దేశంలోనే ఆదర్శంగా
అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేస్తోంది.
రూ.4,000 పెన్షన్, తల్లికి వందనం,
మహిళలకు ఉచిత బస్సు సహా సుమారు
రూ.70 వేల కోట్ల సంక్షేమ పథకాలు
అమలవుతున్నాయి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శనివారం 15.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 115 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# తాగునీటికే తొలి ప్రాధాన్యం





## వాటర్ మూమెంట్ ప్లాన్ ప్రకారమే నీటి నిర్వహణ

## 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులకు నెలవారీ లక్ష్యాలు

## డేటా సెంటర్లకు 3.5 టీఎంసీల నీరే చాలు

**అమరావతి, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో వాటర్ మూమెంట్ ప్లాన్ ప్రకారమే నీటి నిర్వహణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం లోటు వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వల్ని, భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ ఉండాలని సూచించారు. మిగతా 2లో...

# ఆర్థిక స్వాతంత్ర్యానికి 'స్త్రీ శక్తి' బాట

- ఉచిత బస్సు ప్రయాణానికి ఏడాది
- ఇప్పటికి 87 కోట్ల ప్రయాణాలు...
- సగటున రోజుకు 24 లక్షలు
- 'స్త్రీ శక్తికి సంవత్సరం- రెట్టింపైన ఆత్మగౌరవం' పేరుతో రేపు రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలు
- మహిళలతో నేడు ప్రత్యేకంగా భేటీ కానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

2 లో

# సభకు 'సెక్యూరిటీ షీల్డ్'

- 17 నుంచి అసెంబ్లీ.. పటిష్ట బందోబస్తుతో భద్రత
- డిజిటల్ పాస్ స్కాన్.. ఆపై ఎంట్రీ
- నాలుగు వైపులా పోలీస్ నిఘా.. సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ
- పెండింగ్ ప్రశ్నలకు వేగంగా సమాధానాలు.. సభా హామీల అమలుకు ప్రత్యేక వ్యవస్థ

**అమరావతి, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఆంధ్రప్రదేశ్ శాసన మండలి, శాసన సభ సమావేశాలను ప్రశాంతంగా, సమర్థవంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేను రాజు, శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చింతకాయల అధికారులను ఆదేశించారు.

శుక్రవారం అమరావతిలోని శాసన సభ ప్రాంగణంలో శాసన మండలి, శాసన సభ సమావేశాల నిర్వహణకు సంబంధించి సాధారణ



ఏర్పాట్లు, పరిపాలనా అంశాలు, సభ్యులకు అందించాల్సిన సేవలు, శాంతిభద్రతలు, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను మిగతా 2లో...

# పరిధి దాటొద్దు!

- జనసైనికులకు పవన్ కల్యాణ్ గట్టి హెచ్చరిక
- మాట్లాడేటప్పుడు భాషపై జాగ్రత్త.. వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉండాలి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా వేదికలపై మాటా ్లడేటప్పుడు జనసేన నాయకులు, కార్యకర్తలు తమ భాష విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఎవరైనా సరే భాష, మిగతా 2లో...



## నక్సల్స్ రహిత భారత్.. ఘన విజయం



- 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేశం
- 'ఆపరేషన్ సిందూర్'తో సైనిక శక్తి చాటాం
- ఉగ్రవాదులకు ఎక్కడ దాక్కున్నా తీవ్ర పరిణామాలే
- ప్రతి పౌరుడికీ సత్వర న్యాయం అందాలి

2 లో

## సీదిరికి బెయిల్



- 23 రోజుల తర్వాత మాజీ మంత్రికి కోర్టులో ఊరట
- హిట్ అండ్ రన్ కేసులో షరతులతో బెయిల్ మంజూరు

2 లో

# త్రివర్ణ కాంతుల్లో అమరావతి

- విద్యుత్ దీపాల అలంకరణతో అసెంబ్లీ, సచివాలయం

**అమరావతి,ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ,సచివాలయ భవనాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ప్రతిబింబించేలా సచివాలయంలోని ఐదు భవనాలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. అసెంబ్లీ భవనాన్ని సైతం వివిధ రకాల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించడంతో భవన సముదాయం విద్యుత్ కాంతులతో మిరుమిట్లు గొలుపుతోంది. అసెంబ్లీ,సచివాలయ ప్రాంగణాల్లోని రహదారులకు ఇరువైపులా, సెంట్రల్ పార్కులో వివిధ రంగులతో కూడిన ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం ప్రాంగణం విద్యుత్ వెలుగులతో శోభాయమానంగా మారి పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. మిగతా 2లో...



## సీబీఐకి 'ఫుల్ పవర్'!




- లోతైన దర్యాప్తునకు రౌస్ అవెన్యూ కోర్టు గ్రీన్‌సిగ్నల్
- సూత్రధారులు, ఆర్థిక లావాదేవీలపై మరింత లోతుగా విచారణ
- అనుబంధ ఛార్జ్‌షీట్‌కు సీబీఐ కసరత్తు

2 లో

## న్యాయ 'చక్రవర్తి'కి ఘన వీడ్కోలు



- హైకోర్టు న్యాయమూర్తి బీవీఎలఎన్ చక్రవర్తి పదవీ విరమణ
- ఫుల్ బెంచ్ సమక్షంలో వీడ్కోలు..
- న్యాయ సేవలను కొనియాడిన సీజే లీసా గిల్
- సత్యం కుంభకోణం కేసులో చారిత్రక తీర్పు..

3 లో

# ఒకేసారి మున్సిపల్ సమరం!

- రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు ఏకకాలంలో ఎన్నికలు
- విలీన గ్రామాలపై కోర్టు తీర్పు తర్వాత నిర్ణయం : మంత్రి నారాయణ

**రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. విలీన గ్రామాలకు సంబంధించిన అంశంపై కోర్టు తీర్పు వెలువడిన అనంతరం మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. . రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యేలు గోరంట్ల



బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసుతో కలిసి లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను శుక్రవారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిరోజూ సుమారు 7 వేల టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందన్నారు. గత ప్రభుత్వం ప్రజలపై చెత్త పన్ను విధించినప్పటికీ, లక్షల టన్నుల చెత్తను పేరుకుపోయేలా చేసి వెళ్లిపోయిందని విమర్శించారు. మిగతా 3లో...

# పోలవరానికి 'ఫైనల్ టచ్'

- 2027 మార్చికే పూర్తి లక్ష్యం
- వెలిగొండ నిర్వాసితులకు రూ.600 కోట్లు
- విశాఖ డేటా సెంటర్లకు 3 టీఎంసీల గోదావరి జలాలు
- 36 ప్రాజెక్టులకు నెలవారీ వర్క్ ప్రోగ్రెస్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** పోలవరం,వెలిగొండ ప్రాజెక్టు లతో పాటు మొత్తం 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులు, ఐడిసి లిఫ్ట్ స్కీం, వంటి అంశాలతో పాటు,ఎల్ నినో వంటి సందర్భంలో త్రాగునీటి అవసరాల నిమిత్తం ఏ రకంగా ప్రణాళిక తీసుకుంటున్నాం అనే అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్షా సమావేశంలో చర్చించడం జరిగిందని



మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతి సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు సివిల్ వర్క్స్ 90% పూర్తయ్యాయని, భూసేకరణ 94% పూర్తిచేశామని, అదేవిధంగా ఆర్ అండ్ ఆర్ నిర్వాసితులకు తరలింపు 52% పూర్తయిందని, ఇలా మొత్తం పోలవరం ప్రాజెక్టు మిగతా 3లో...

## పోలీసు పతకాల పండుగ!




- ఏపీకి 21.. తెలంగాణకు 15 సేవా పతకాలు
- దేశవ్యాప్తంగా 1,057 మంది ఎంపిక..
- సాహస సేవలకు 301 గ్యాలంట్రీ మెడల్స్

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో అసమాన ప్రతిభ, ధైర్య సాహసాలు ప్రదర్శించిన పోలీసు, అగ్నిమాపక, హోంగార్డు, పౌర రక్షణ విభాగాల సిబ్బందికి కేంద్ర హోంశాఖ సేవా పతకాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా మొత్తం 1,057 మంది అధికారులను ఈ పతకాల కోసం కేంద్ర హోం శాఖ ఎంపిక చేయగా వీరిలో 92 మంది మిగతా 2లో...

# పరిధి దాటొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

భావ వ్యక్తీకరణ విషయంలో తమ పరిధి దాటవద్దని ఆయన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ శ్రేణులు పాటించాల్సిన మార్గదర్శకాలపై జనసేన కేంద్ర కార్యాలయం ఒక కీలక ప్రకటన విడుదల చేసింది.

**అసలేం జరిగింది? :** జనసేనకు మద్దతుగా ఉండే ఒక ప్రవాసాంధ్రుడు ఇటీవల కొన్ని వ్యాఖ్యలు చేశారు. ప్రకాశం జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు రియాజ్‌పై ఆయన పలు ఆరోపణలు గుప్పించారు. దీనిపై రియాజ్ తీవ్ర స్థాయిలో స్పందించారు. ఆరోపణలు చేసిన వ్యక్తిని ఉద్దేశించి సోషల్ మీడియాలో బూతు పదజాలం వాడారు. రియాజ్ తీరుపై జనసైనికుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. ఈ తరహా వివాదాలకు వెంటనే చెక్ పెట్టేందుకు పవన్ కల్యాణ్ రంగంలోకి దిగారు.

**వ్యక్తిగత దూషణలు వద్దు :** అనవసర విషయాలపై ఇష్టానుసారం మాట్లాడటం ఏమాత్రం సరికాదని పవన్ కల్యాణ్ తేల్చి చెప్పారు. టీవీ చర్చలు, సోషల్ మీడియాలో మాట్లాడేటప్పుడు పార్టీ నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలన్నారు. ఎవరూ కూడా ఇతరుల వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లొద్దని సూచించారు. వ్యక్తిగత దూషణలకు దిగొద్దని హెచ్చరించారు. పార్టీ సిద్ధాంతాలు, నిబంధనలకు అనుగుణంగానే నాయకులు స్పందించాలని స్పష్టం చేశారు. నాయకులు, జనసైనికులు అనవసర ఆవేశాలకు లోను కావద్దని పార్టీ సూచించింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ అసభ్య పదజాలాన్ని వాడవద్దని ఆదేశించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ మహిళలను గౌరవిస్తూ మాట్లాడాలని పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

**ఆ విషయాలు రచ్చ చేస్తే వేటే :** పార్టీ అంతర్గత విషయాలను సోషల్ మీడియా వేదికగా రచ్చ చేయొద్దని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అలాగే జనసేన భావజాలాన్ని కించపరిచేలా వ్యవహరిస్తే పార్టీ ఏమాత్రం ఉపేక్షించదని, క్రమశిక్షణా చర్యలు ఉంటాయని చెప్పారు. జనసైనికులను కావాలని రెచ్చగొట్టే వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజకీయ ప్రత్యర్థులు పన్నే వలలో పడొద్దని కార్యకర్తలను అప్రమత్తం చేశారు.

**కూటమి స్ఫూర్తి ముఖ్యం :** రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఎన్డీయే కూటమి ప్రభుత్వ స్ఫూర్తిని నిలబెట్టేలా ప్రతి ఒక్కరి మాట, తీరు ఉండాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మరోవైపు పార్టీ కోసం నిస్వార్థంగా కష్టించి పనిచేసే ప్రతి జనసైనికుడికి తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. జనసైనికులు, వీర మహిళల సంక్షేమం ఎప్పుడూ అధ్యక్షుల వారి దృష్టిలో ఉంటుందని జనసేన కేంద్ర కార్యాలయం ఆ ప్రకటనలో వివరించింది.

## నక్సల్స్ రహిత భారత్.. ఘన విజయం

**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ దేశ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చడం దేశం సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటని ఆమె కొనియాడారు. బస్తర్ వంటి సున్నిత ప్రాంతాల్లో జరుగుతున్న వేగవంతమైన అభివృద్ధి, అక్కడి ప్రజల సాంస్కృతిక భాగస్వామ్యం ఈ మార్పునకు నిదర్శనమని పేర్కొన్నారు. ఉగ్రవాదులు, వారికి వెన్నుదన్నుగా నిలిచే వారు ఎక్కడ దాక్కున్నా తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని రాష్ట్రపతి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. సరిహద్దుల్లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లను నెలమట్టం చేయడంలో భారత సాయుధ దళాల ఖచ్చితమైన లక్ష్య ఛేదన సామర్థ్యాన్ని 'ఆపరేషన్ సిందూర్' ప్రపంచానికి చాటిచెప్పిందని రాష్ట్రపతి ప్రశంసించారు.

దేశంలో న్యాయవ్యవస్థ పాత్రను ప్రస్తావిస్తూ.. వనరులు, ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల ఏ ఒక్క పౌరుడు న్యాయానికి దూరం కాకుండా చూడాల్సిన బాధ్యత న్యాయ వ్యవస్థతో ముడిపడి ఉన్న ప్రతి ఒక్కరిపైనా ఉందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. సామాన్యులకు సైతం సత్వర న్యాయం అందినప్పుడే నిజమైన ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించబడతాయని గుర్తుచేశారు. భారత్ 80 వ వసంతంలోకి అడుగు పెడుతున్న ఈ పవిత్ర శుభవేళ.. దేశ రక్షణ, అంతర్గత భద్రత, సమగ్రాభివృద్ధి దిశగా యావత్ భారతావని ఐక్యంగా ముందుకు సాగాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు.

## సీబీఐకి 'ఫుల్ పవర్'!

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ పేపర్ లీక్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేంద్ర దర్యాప్తు సంస్థ కి ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో కీలక ఊరట లభించింది. ఈ కేసులో మరింత లోతైన దర్యాప్తు జరిపేందుకు అనుమతి కోరుతూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం ఆమోదించింది. దీంతో పేపర్ లీకేజీ వెనుక ఉన్న ఇతర కీలక సూత్రధారులు, ఆర్థిక లావాదేవీలు, అనుమానితులపై విచారణను మరింత వేగవంతం చేసేందుకు సీబీఐకి మార్గం సుగమమైంది.

కాగా, ఈ కేసులో ఇప్పటికే 13 మంది నిందితులపై సీబీఐ ప్రాథమిక ఛార్జ్‌షీట్ ను దాఖలు చేసింది. ప్రస్తుతం నిందితులపై అభియోగాల నమోదు ప్రక్రియపై కోర్టులో ఇరువర్గాల వాదనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మరిన్ని కీలక ఆధారాలు సేకరించడానికి కోర్టు అనుమతి ఇవ్వడంతో, రాబోయే రోజుల్లో అనుబంధ ఛార్జ్‌షీట్‌ను సమర్పించే దిశగా సీబీఐ అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

## సీదిరికి బెయిల్



**శ్రీకాకుళం, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ సీదిరి అప్పలరాజుకు న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. కాశీబుగ్గలో నమోదైన హిట్ అండ్ రన్ కేసుకు సంబంధించి సోంపేట కోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గత 23 రోజులుగా శ్రీకాకుళం (అంపోలు) జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయన, కోర్టు తీర్పుతో త్వరలోనే జైలు నుంచి విడుదల కానున్నారు.

**కేసు నేపథ్యం, ఆరోపణలు :** కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒక గొర్రెల కాపరి (దానయ్య) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మాజీ మంత్రి కుమారుడి ప్రమేయం ఉందనే కోణంలో విచారణ జరిపిన పోలీసులు, కేసును పక్కదోవ పట్టించేందుకు, సాక్ష్యాధారాలను తారుమారు చేసేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ సీదిరి అప్పలరాజుపై అభియోగాలు మోపారు. దీని ఆధారంగా కాశీబుగ్గ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టు రిమాండ్ విధించడంతో ఆయనను జిల్లా జైలుకు తరలించారు.

**23 రోజుల రిమాండ్ తర్వాత లభించిన బెయిల్ :** గత 23 రోజులుగా జైలులోనే ఉన్న సీదిరి అప్పలరాజు తరఫు న్యాయవాదులు బెయిల్ కోసం సోంపేట కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గతంలో సమర్పించిన దరఖాస్తులు తిరస్కరణకు గురైనప్పటికీ, తాజాగా ఇరుపక్షాల సుదీర్ఘ వాదనలను పరిశీలించిన న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# తాగునీటికే తొలి ప్రాధాన్యం




(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జల వనరుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి, ప్రాధాన్యతా క్రమంలో చేపట్టనున్న 36 ప్రాజెక్టులు, రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల, తాగు నీటి సరఫరా నిర్వహణ ప్రణాళిక, జలధార- జలహారతి కార్యక్రమాల అమలుపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటి వరకూ 89.9 శాతం మేర సివిల్ పనులు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు. పోలవరం ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్టు జల వనరుల శాఖ సీఎంకు తెలియచేసింది. ఈసీఆర్ఎఫ్ గ్యాప్ 1, గ్యాప్ 2 పనులు శరవేగంగా చేపట్టామని వివరించారు. ఇటీవల 14 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాలు గోదావరికి వచ్చినా ప్రాజెక్టు పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనసాగించినట్టు తెలిపారు. డ్యామ్ సైట్ వద్ద రహదారులతో పాటు డ్యామ్ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల పనులు కూడా చేపట్టాలని సీఎం సూచించారు. ప్రాజెక్టు సమీపంలో గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ స్థానికుల సెంటిమెంట్ ను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి కల్లా విశాఖ వరకూ ఎడమ కాలువ బ్యాలెన్సు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈలోగా అనకాపల్లి వరకూ ఉన్న నీటి వనరులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నీటిని నింపాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పోలవరం కుడి ఎడమ కాలువల్లో 17,500 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి అనుగుణంగా పనులు చేయాలని స్పష్టం చేశారు. రెండు కాలువలకూ మంచి పేర్లను సూచించాలని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు సమీపంలోని ప్రాంతాలను సద్వినియోగం చేసుకోవటంతో పాటు పర్యాటకం గానూ తీర్చిదిద్దాలన్నారు.

**డేటా సెంటర్లకు 3.5 టీఎంసీల నీరు చాలు :** డేటా సెంటర్లకు నీటి అవసరాలపై కొందరు లేనిపోని విమర్శలు చేస్తున్నారని.. మొత్తంగా వాటికి 3.5 టీఎంసీల నీరే సరిపోతుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో తాగు నీటికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఆ తదుపరి పారిశ్రామిక అవసరాలకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. ఈ సీజన్ లో ఆరు తడి పంటలు సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగేలా జల ధార- జల హారతి పనుల్ని కొనసాగించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుష్కలంగా నీటి వనరులు ఉన్న రాష్ట్రంగా గోదావరి నీటిని అటు ఉత్తరాంధ్రకు, ఇటు కృష్ణా డెల్టా ప్రాంతానికి అవసరమైనంత మేర నీరు తీసుకునే ఆస్కారం ఉందన్నారు. విశాఖ నుంచి అమరావతి వరకూ అంతర్గత జల రవాణా మార్గాలతో అనుసంధానించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా జలవనరుల శాఖ ఆధీనంలో ఉన్న భూముల్ని సద్వినియోగం చేసుకునే అవకాశాలను అధ్యయనం చేయాలని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయటంతో పాటు నిర్వాసితుల సమస్యల్ని కూడా మానవతా దృక్పథంతో పరిష్కరించాలన్నారు. 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోకా పూర్తి చేయాలన్నారు. దీనికోసం నెల వారీ లక్ష్యాలను నిర్దేశించు కోవాలన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు దిగువన ఆయకట్టుకు నీరిచ్చే అంశాన్ని కూడా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్సీ, సీఈలు హాజరయ్యారు.

# సభకు 'సెక్యూరిటీ షీల్డ్'

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షించేందుకు సర్వీసెస్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, సాధారణా పరిపాలనా శాఖ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, అదనపు డీజీపీ మధుసూదన రెడ్డితో వారు వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమావేశాల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

**పెండింగ్ ప్రశ్నలకు సత్వరమే సమాధానాలు... :** ఈ సందర్భంగా శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేను రాజు, శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చింతకాయల మాట్లాడుతూ, సభా సమావేశాల్లో సభ్యులు అడిగే ప్రశ్నలకు నిర్ణీత సమయంలో సమాధానాలు అందించడం అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశమని పేర్కొన్నారు. అయితే కొన్ని ప్రశ్నలకు సమాధానాలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండటం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖల నుంచి సకాలంలో, స్పష్టంగా, సమగ్రంగా సమాధానాలు అందేలా పటిష్టమైన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమాధానం ఇవ్వడానికి వీలుకాని ప్రశ్నలు ఏవైనా ఉంటే, అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేస్తూ సంక్షిప్త సమాధానం అందించాలని సూచించారు.

అదేవిధంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలను సమీక్షించి, వాటిపై తగిన నిర్ణయం తీసుకోవాలని, అవసరమైన చోట చట్టబద్ధమైన విధానాన్ని అనుసరించి పెండింగ్ జాబితా నుంచి తొలగించే ప్రక్రియను చేపట్టాలని సూచించారు. శాసన మండలి, శాసన సభల గౌరవాన్ని, సభ్యుల హక్కులను దృష్టిలో ఉంచుకుని ప్రశ్నలకు సమాధానాల ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

**సభా హామీల అమలుకు పటిష్టమైన వ్యవస్థ... :** సభా సమావేశాల సందర్భంగా మంత్రులు, సంబంధిత శాఖల తరఫున ఇచ్చే హామీల అమలుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని వారు అధికారులకు సూచించారు. సభలో ఇచ్చిన హామీలను సంబంధిత శాఖలు నిర్ణీత కాలవ్యవధిలో అమలు చేసేలా పర్యవేక్షణ, సమీక్షకు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు.

సభా హామీల అమలులో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచడంతో పాటు, హామీల స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షించే విధంగా పటిష్టమైన వ్యవస్థను అమలు చేయాలని సూచించారు.

**సభ్యుల మెడికల్ బిల్లుల చెల్లింపులు వేగవంతం చేయాలి... :** శాసన మండలి, శాసన సభ సభ్యులకు సంబంధించిన సంక్షేమ అంశాలపై కూడా వారు అధికారులతో చర్చించారు. సభ్యుల పెండింగ్ మెడికల్ బిల్లుల చెల్లింపులను సత్వరమే పరిష్కరించి, అర్హత కలిగిన క్లెయిమ్‌లకు ఎటువంటి జాప్యం లేకుండా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెడికల్ బిల్లుల పరిష్కారంలో ఏవైనా పరిపాలనా లేదా సాంకేతిక సమస్యలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

**సభ్యుల పింఛను పెంపు ప్రతిపాదనలపై త్వరిత నిర్ణయం... :** అదేవిధంగా సభ్యుల పింఛను సొమ్మును పెంచేందుకు పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను కూడా సత్వరమే పరిశీలించి, అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి ఒక కొలిక్కి తీసుకురావాలని శాసన మండలి అధ్యక్షులు, శాసన సభ స్పీకర్ అధికారులకు సూచించారు. సభ్యుల పింఛను పెంపు అంశానికి సంబంధించి ప్రస్తుతం ఉన్న ప్రతిపాదనల స్థితిగతులు, అవసరమైన పరిపాలనా చర్యలు, ఆర్థికపరమైన అంశాలను సమీక్షించి, వీలైనంత త్వరగా తగిన నిర్ణయానికి రావాలని ఆదేశించారు.

**డిజిటల్ పాస్‌ల విధానం అమలు... :** అనంతరం పోలీస్ ఉన్నతాధికారులతో శాంతిభద్రతలు, భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చింతకాయల మాట్లాడుతూ, శాసన మండలి, శాసన సభ సమావేశాలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అదనపు డీజీపీ మధుసూదన రెడ్డిని ఆదేశించారు.

ఈ సమావేశాల్లో ఈసారి డిజిటల్ పాస్‌ల విధానాన్ని అమలు చేస్తున్నందున, పాస్‌లను తప్పనిసరిగా స్కాన్ చేసి, వాటి ధ్రువీకరణ అనంతరం మాత్రమే సంబంధిత వ్యక్తులను శాసన మండలి, శాసన సభ ప్రాంగణాల్లోకి అనుమతించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

డిజిటల్ పాస్‌ల వినియోగం, స్కానింగ్, ధ్రువీకరణ ప్రక్రియపై భద్రతా సిబ్బందికి ముందుగానే పూర్తి అవగాహన కల్పించాలని, అనుమతించబడిన వ్యక్తులకే నిబంధనల ప్రకారం ప్రవేశం కల్పించేలా ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.

**మన సభ - జన సభ కార్యక్రమానికి ప్రత్యేక భద్రత... :** మన సభ - జన సభ' కార్యక్రమాన్ని నేడు, రేపు నిర్వహిస్తున్న నేపథ్యంలో సాయంత్రం 6 గంటల నుంచి శాసన మండలి, శాసన సభ ప్రాంగణాల్లోకి సందర్శకులను అనుమతించే అవకాశం ఉన్నందున, ఆ సమయంలో కూడా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని స్పీకర్ సూచించారు. సందర్శకుల ప్రవేశం, డిజిటల్ పాస్‌ల పరిశీలన, వాహనాల రాకపోకలు, పార్కింగ్, భద్రతా తనిఖీలు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించి, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భద్రతా లోపాలపై ప్రత్యేక దృష్టి... గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భద్రతా ఏర్పాట్లలో ఎక్కడైనా లోపాలు, గ్యాప్‌లు ఉన్నాయో ముందుగానే గుర్తించి వాటిని పూర్తిస్థాయిలో సరిదిద్దాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చింతకాయల పోలీస్ అధికారులకు సూచించారు.

సచివాలయం చుట్టూ విస్తృతంగా ఖాళీ ప్రాంతాలు ఉన్నందున, భద్రతాపరంగా ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. సచివాలయం, శాసన మండలి, శాసన సభ ప్రాంగణాల నాలుగు వైపులా పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు, అధునాతన సమాచార, సాంకేతిక వ్యవస్థలను వినియోగించి నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు.

సీసీటీవీ కెమెరాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇతర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ భద్రతను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది ఎటువంటి ఏమరపాటుకు తావులేకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి అంశాన్ని ముందుగానే అంచనా వేసి అవసరమైన చర్యలు చేపట్టాలని స్పీకర్ ఆదేశించారు.

సభా సమావేశాలు జరిగే సమయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు, సందర్శకుల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా, అదే సమయంలో భద్రతా ప్రమాణాల్లో ఎటువంటి రాజీ లేకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు.

ఈ సమావేశాల్లో శాసన సభ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు, శాసన సభ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్, గుంటూరు ఎస్.పీ. వకుల్ జిందాల్, సీఎం సెక్యూరిటీ ఎస్.పీ. భద్రయ్య, జాయింట్ సెక్రటరీ విజయరాజు, డిప్యూటీ సెక్రటరీ వనిత రాణి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు పతకాల పండుగ!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలకు, 301 మందికి పోలీసు మెడల్ ఫర్ గ్యాలంట్రీ, 664 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలకు ఎంపిక అయ్యారు. గ్యాలంట్రీ పతకాలు సాధించిన 301 మందిలో అత్యధికంగా 197 మంది తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో సాహసోపేత సేవలు అందించిన వారు ఉన్నారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన 51 మందికి, ఈశాన్య రాష్ట్రాలలోని 12 మంది పోలీసులకు ఈ పతకాలు దక్కాయి.

**తెలంగాణకు 15, ఏపీకి 21:** కాగా, ఈ ప్రతిష్ఠాత్మక పతకాలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 21, తెలంగాణ నుంచి 15 మంది ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ఎంపికైన 15 మందిలో ముగ్గురు పోలీసులకు గ్యాలంట్రీ మెడల్స్, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 10 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు ప్రకటించారు. రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలను అదనపు డిప్యూటీ కమిషనర్ జోగుల నర్సయ్య, ఎస్పీ ఆర్. జగదీశ్వర్ రెడ్డి అందుకోనుండగా గ్యాలంట్రీ మెడల్స్ ను జూనియర్ కమాండోలు బి. సత్యరావు, కె. సందీప్ కుమార్, జె. వంశీకృష్ణ అందుకోబోతున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ పోలీసులలో ఏడుగురు పోలీసులకు గ్యాలంట్రీ మెడల్స్, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 11 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఏపీకి చెందిన ఐజీ గుడి విజయ్ కుమార్, ఐజీ బలంకారి వెంకట రామిరెడ్డి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలకు ఎంపిక కాగా.. గ్యాలంట్రీ మెడల్స్ కు హెడ్ కానిస్టేబుళ్లు కొర్లాన మహేశ్, పైడి శ్రీరామమూర్తి, అడారి హేమసుందర రావు, చింతపల్లి సత్యనారాయణ, రౌతు మహేశ్, ఆబోతుల అప్పలనాయుడు, రుతాల కన్నబాబు ఎంపికయ్యారు.

**సీబీఐ అధికారులకు 21 పతకాలు:** కేంద్ర దర్యాప్తు సంస్థ లో పనిచేస్తున్న 21 మంది అధికారులకు పతకాలు దక్కాయి. ఇందులో ఆరుగురికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 15 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు. విశాఖపట్నం డీఎస్పీ (సీబీఐ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సంజయ్ కుమార్ సమాల్?కు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం వరించింది.

## త్రివర్ణ కాంతుల్లో అమరావతి



(మొదటి పేజీ తరువాయి)

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా విజయవాడలోని లోక్ భవన్,ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం,ప్రకాశం బ్యారేజ్,ప్రఖ్యాత ఉండవల్లి గుహలు,ఇతర చారిత్రక ప్రాముఖ్యత కలిగిన భవనాలు, ప్రముఖ కట్టడాలను సైతం విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ఈ ప్రత్యేక విద్యుత్ అలంకరణలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయ భవనాలకు మరియు నగరానికి మరింత శోభను తీసుకువచ్చాయి.

# ఆర్థిక స్వాతంత్ర్యానికి 'స్త్రీ శక్తి' బాట

**అమరావతి, ఆగస్టు 14(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో మహిళల ఆర్థిక సాధికారతకు 'స్త్రీ శక్తి' పథకం కొత్త అర్థాన్ని తీసుకొచ్చింది. సరిగ్గా ఏడాది క్రితం ఆగస్టు 15న ఈ పథకానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అందిస్తూ వారి రోజువారీ ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గిస్తోంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా, ఎన్నిసార్లయినా పరిమితులు లేకుండా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించడంతో మహిళల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారు. స్త్రీ శక్తి పథకం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు 87 కోట్ల ప్రయాణాలను వివిధ వర్గాల మహిళలు చేశారు. మహిళల ప్రయాణానికి ప్రభుత్వం రోజుకు రూ.8.53 కోట్లను సబ్సిడీగా అందిస్తోంది. పథకం అమల్లోకి వచ్చిన ఏడాది కాలంలో ఇప్పటివరకు రూ.3,095 కోట్లు ఈ పథకం కోసం ప్రభుత్వం ఖర్చు పెట్టింది.



**ఆర్టీసీలో 76 శాతం బస్సులకు వర్తింపు :** ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లె వెలుగు, పల్లెవెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ.. ఇలా ఐదు కేటగిరీల బస్సుల్లో స్త్రీ శక్తి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. మొత్తం 9,978 ఆర్టీసీ బస్సుల్లో 76 శాతం బస్సులు .. అంటే 7,631 బస్సులను ఈ పథకానికి వినియోగిస్తున్నారు. ఆలయాలకు నడిపే ప్రత్యేక బస్సు సర్వీసుల్లోనూ ఈ సౌకర్యాన్ని మహిళలు వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. స్త్రీ శక్తి పథకం రాకముందు ఆర్టీసీ బస్సుల్లో మహిళల వాటా 40 శాతం ఉండగా.. ఇప్పుడు అది 62 శాతానికి పెరిగింది. రోజువారీ మహిళా ప్రయాణికుల సంఖ్య కూడా 9.47 లక్షల నుంచి 24 లక్షలకు చేరుకుంది. పథకం అమలవుతున్న బస్సుల్లో ఆక్యుపెన్సీ 93 శాతానికి చేరింది.

**చిరు వ్యాపారలకు ఊతం.. తగ్గిన రోడ్ ప్రమాదాలు :** స్త్రీ శక్తి పథకం ద్వారా కేవలం ప్రయాణ ఖర్చును తగ్గించడం మాత్రమే కాకుండా.. మహిళలకు విద్య, ఉపాధి, వైద్యం, వ్యాపారం, ఇతర అవసరాలకు ఉపయోగపడుతోంది. కాలేజీలకు వెళ్లే వారికి, చిరు వ్యాపారం నిమిత్తం ఒక ఊరి నుంచి మరొక ఊరు వెళ్లేవారికి, దైవ దర్శనాలకు వెళ్లేవారికి ఎంతగానో ఉపయోగపడుతోంది. ఆధార్ కార్డును చూపిస్తే రాష్ట్ర సరిహద్దులో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఇదే తరహా పథకాన్ని 4 కేటగిరి బస్సుల్లోనే అమలు చేస్తున్నారు. కాగా ఏపీలో 5 రకాల బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. మరోవైపు ఈ పథకం అమలు చేసిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ ప్రమాదాలు గణనీయంగా తగ్గాయని అధికారులు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. చాలా మంది షేర్ ఆటోలు, వ్యక్తిగత వాహనాల ద్వారా ప్రయాణాలను తగ్గించుకుని ఆర్టీసీ బస్సులు ఎక్కుతుండడంతో ప్రమాదాల సంఖ్య కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గినట్టు అంచనా.

**మహిళలతో ముఖ్యమంత్రి ముఖాముఖి.. :** పథకం ప్రవేశపెట్టి ఏడాదైన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మహిళలతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. "స్త్రీ శక్తికి సంవత్సరం- రెట్టింపైన ఆత్మగౌరవం" పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమం చేపట్టనున్నారు. రాజధాని పరేడ్ గ్రౌండ్ లో స్వాతంత్ర్య దినోత్సవాల కార్యక్రమం అనంతరం "స్త్రీ శక్తికి సంవత్సరం- రెట్టింపైన ఆత్మగౌరవం" కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. పరేడ్ గ్రౌండ్ నుంచి సీఎం క్యాంప్ కార్యాలయం వరకు స్త్రీశక్తి లబ్ధిదారులతో కలిసి బస్సులో ముఖ్యమంత్రి ప్రయాణించనున్నారు. క్యాంప్ కార్యాలయంలో మహిళలతో కలిసి హై-టీలో పాల్గొననున్నారు. పథకం అమలవుతున్న తీరు... కలుగుతున్న లబ్ది వంటి అంశాలపై మహిళలతో మాట్లాడి.. వారి అభిప్రాయాలు తెలుసుకోనున్నారు.

# కూటమి ప్రభుత్వ పనితీరుపై 90 శాతానికి పైగా ప్రజలు సంతృప్తి

## ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్సీ ఆలపాటి







**తెనాలి, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్)** : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నట్లు కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం తెనాలి చెంచుపేట 30, 31 వార్డుల్లో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆయన ఇంటింటికీ పర్యటించి సుమారు 150 కుటుంబాలను నేరుగా కలిసి ప్రభుత్వ పథకాల అమలుపై అభిప్రాయాలు సేకరించారు.

కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడిన డా. పెమ్మసాని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. రూ.4 వేల సామాజిక పెన్షన్, స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అదే సమయంలో హంద్రీ--నీవా, బనకచర్ల, పోలవరం, గుంటూరు ఛానల్ వంటి భారీ నీటిపారుదల ప్రాజెక్టుల ద్వారా తాగు, సాగునీటి అవసరాలను తీర్చేందుకు దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు.

ప్రజలకు పథకాలు నిజంగా అందుతున్నాయా, ఇంకా ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయనే విషయాలను స్వయంగా తెలుసుకోవడానికే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని డా. పెమ్మసాని పేర్కొన్నారు. తెనాలిలో నిర్వహించిన సర్వేలో కూటమి ప్రభుత్వ పనితీరుపై 90 శాతానికి పైగా ప్రజలు సంతృప్తికరమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారని, మిగిలిన సమస్యలను కూడా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జూలై 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నామని చెప్పారు. ప్రజలతో మమేకమవుతూ వారి సూచనలను ప్రభుత్వానికి చేరవేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.









## న్యాయ 'చక్రవర్తి'కి ఘన వీడ్కోలు

**అమరావతి,ఆగస్టు 14(జర్నలిస్ట్ ఫైల్)** :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి బీవీఎల్ఎన్ చక్రవర్తికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ఆధ్వర్యంలో ఫుల్ బెంచ్ సమక్షంలో ఘన వీడ్కోలు పలికారు. హై కోర్టు న్యాయమూర్తి బీవీఎల్ఎన్ చక్రవర్తి పదవీ విరమణ చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకుని హైకోర్టు మొదటి కోర్టు హాల్లో శుక్రవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి నిబద్ధత కలిగిన న్యాయమూర్తని కొనియాడారు. జస్టిస్ చక్రవర్తి తన పదవీ కాలంలో అనేక కీలకమైన తీర్పులను వెలువ రించారని న్యాయ వ్యవస్థకు విశేష సేవలందించారని అభినందించారు. ఐటీ రంగంలో ప్రభజంనం సృష్టించిన సత్యం కంప్యూటర్స్ కుంబకోణం కేసులో ప్రత్యేక సీబీఐ కోర్టు న్యాయమూర్తిగా చారిత్రాత్మక తీర్పును ఇచ్చారన్నారు. ప్రధాన నిందితుడితో పాటు 10 మందికి 7 సంవత్సరాల శిక్షను విధించి కీలకమైన తుది తీర్పును వెలువరించారని వివరించారు. జస్టిస్ చక్రవర్తి సివిల్, క్రిమినల్ మరియు పబ్లిక్ సర్వెంట్ మిస్‌కండక్ట్ వంటి అనేక కేసులను విచారించారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ పేర్కొన్నారు.

జస్టిస్ చక్రవర్తి తూర్పు గోదావరి జిల్లా కందులపాలెం గ్రామంలో బి.పాపారాయ చౌదరి, విజయలక్ష్మీ దంపతులకు 1964లో జన్మించారని,తామరపల్లి,గంగవరంలో ప్రాథమిక, హైస్కూల్ విద్యను పూర్తి చేశారన్నారు. రాజమండ్రిలోని జీఎస్ కె ఎం లా కాలేజీ నుండి న్యాయవాద శాస్త్ర పట్టా అందుకున్నారన్నారు. 1988వ సంవత్సరంలో కాకినాడ బార్ కౌన్సిల్ సభ్యుడిగా,న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారని తెలిపారు. 1994లో ఏపీ జ్యుడీషియల్ సర్వీసెస్ లో ఉత్తీర్ణులై జిల్లా మున్సిఫ్ మేజిస్ట్రేట్ గా ఎంపికయ్యారన్నారు. జస్టిస్ చక్రవర్తి జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా వివిధ బాధ్యతలకు సమర్థవంతంగా నిర్వహించారనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ పేర్కొన్నారు. మార్చి 2024లో హై కోర్టు శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం జస్టిస్ చక్రవర్తి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడవాలని కోరుకుంటున్నామని హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ అన్నారు.

పదవీ విరమణ చేయనున్న జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తన విద్యార్థి దశ నుండి న్యాయవాదిగా,న్యాయమూర్తిగా ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ప్రతి దశలోనూ ఉత్తమ సలహాలు అందించిన పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు.

## జూనియర్ డాక్టర్ల ఆందోళన ఉధృతం



- ఐదో రోజు సమ్మె.. భారీ బైక్ ర్యాలీ
- రిలే నిరాహార దీక్షకు ఇంటర్న్‌లు, పీజీ రెసిడెంట్ల భారీ మద్దతు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ )**: వేతన సవరణతో పాటు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ గుంటూరు మెడికల్ కాలేజీ జూనియర్ వైద్యులు చేపట్టిన సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. జీఎంసీ జూడా, ఏపీ జూడా ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆందోళనలో భాగంగా శుక్రవారం రిలే నిరాహార దీక్షతో పాటు గుంటూరు నగరవ్యాప్తంగా భారీ మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇంటర్న్‌లు, పీజీ రెసిడెంట్లు, జూనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీని ఏపీ జూడా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఈశ్వర్ శంకర్ జెండా ఊపి ప్రారంభించారు. రెండు గంటలకు పైగా కొనసాగిన ఈ ర్యాలీ నగరంలోని ప్రధాన వీధుల మీదుగా సాగి ప్రజలకు జూనియర్ వైద్యుల డిమాండ్లను వివరించింది. "న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి", "ప్రభుత్వం వెంటనే స్పందించాలి" అంటూ వైద్యులు నినాదాలు చేశారు. ట్రాఫిక్ అనుమతులతో, పోలీసుల సమన్వయంతో ర్యాలీ ప్రశాంతంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా జూడా నాయకులు మాట్లాడుతూ ఐదు రోజులుగా శాంతియుత నిరసనలు, రిలే నిరాహార దీక్షలు, ప్రభుత్వానికి పలుమార్లు వినతులు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సానుకూల స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు ఇప్పటికే ఉద్యమ తదుపరి దశ గురించి సమాచారం ఇచ్చామని, ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేయక తప్పదని హెచ్చరించారు. తమ సహనాన్ని బలహీనతగా భావించవద్దని, న్యాయం జరిగే వరకు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో ఉద్యోగులకు నష్టం జరగొద్దు

- ఏపీ జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్‌జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ. విద్యాసాగర్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ )**: రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 అమలుకు సంబంధించి నిర్వహించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఏపీ జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్‌జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ. విద్యాసాగర్ ఉద్యోగుల తరఫున పలు కీలక అంశాలను ప్రభుత్వ కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఉత్తర్వుల అమలులో ప్రతి దశకు తగిన సమయం కేటాయించడంతో పాటు, ఉద్యోగులకు ఎలాంటి నష్టం కలగకుండా ఆచరణాత్మకంగా, న్యాయబద్ధంగా అమలు చేయాలని కోరారు.

విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రమోషన్లపై విధించిన ఫ్రీజింగ్‌ను ఈ నెలలోనే ఎత్తివేయాలని, కారుణ్య నియామకాలపై ఉన్న నిలుపుదలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కొత్త జోన్ లేదా జిల్లాకు కేటాయించిన ఉద్యోగులను వారి ప్రస్తుత పోస్టుల్లోనే కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జైళ్ల శాఖలో వార్డెన్, చీఫ్ వార్డెన్ పోస్టులను జిల్లా లేదా సంబంధిత జోనల్ కేడర్‌లోనే కొనసాగించాలని, నాన్-గెజిటెడ్ కేడర్‌ను స్టేట్ లేదా మల్టీ జోన్ కేడర్‌గా మార్చడం సమంజసం కాదని స్పష్టం చేశారు.

జల వనరుల శాఖలోని సర్కిల్, స్పెషల్ యూనిట్ల ప్రస్తుత వ్యవస్థను యథాతథంగా కొనసాగించాలని, ఎయిడెడ్ సంస్థల నుంచి ప్రభుత్వంలోకి వచ్చిన ఉద్యోగులు, రివర్షన్ పొందిన ఉద్యోగుల సీనియారిటీ సమస్యలను సమగ్రంగా పరిష్కరించాలని కోరారు. రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో తలెత్తే సమస్యలను నిరంతరం పర్యవేక్షించేందుకు సచివాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని, అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్--1లో చేర్చే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విశాఖపట్నం, పాడేరు, తిరుపతి, చిత్తూరు ప్రాంతాల ఉపాధ్యాయుల ప్రత్యేక సమస్యల పరిష్కారంతో పాటు ఈ-ఎస్ఆర్ పూర్తి చేసేందుకు తగిన గడువు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

సమావేశంలో జేఏసీ సెక్రటరీ జనరల్ కేవీఎస్ ప్రసాద్, ఫ్యాప్టో చైర్మన్ సాయి శ్రీనివాస్, ఏపీఎన్‌జీజీవో ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు జి. హృదయరాజు, పీఆర్టీయూ అధ్యక్షుడు మిట్ట కృష్ణయ్య, ఏపీఎస్ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు శ్రీనివాస్, రమణారెడ్డి, జేఏసీ నాయకులు భూక్య సేవా నాయక్, భారతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వేమూరు నియోజకవర్గంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలు

- అమృతలూరులో 80 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన.. కొల్లూరులో సైకిల్ ర్యాలీ





**వేమూరు(జర్నలిస్ట్ ఫైల్)**:స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వేమూరు నియోజకవర్గంలో శుక్రవారం పలు ప్రత్యేక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు ఆధ్వర్యంలో ఆగస్టు 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా అమృతలూరు, కొల్లూరు మండలాల్లో జాతీయ జెండా ప్రదర్శన, ర్యాలీలు, సైకిల్ ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు.

అమృతలూరు సెంటర్‌లో 80 అడుగుల భారీ జాతీయ జెండా ప్రదర్శనను నిర్వహించారు. అమృతలూరు పీఎం శ్రీ జెడ్పీ పాఠశాల విద్యార్థులు రూపొందించిన ఈ భారీ జాతీయ జెండా ప్రదర్శనను నక్కా ఆనంద బాబు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి జాతీయ జెండా ర్యాలీలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు త్రివర్ణ పతాకాలను చేతబూని దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆనంద బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో జాతీయ భావం, దేశభక్తి స్ఫూర్తిని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

కొల్లూరు సెంటర్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కొల్లూరు సెంటర్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు సాగిన ర్యాలీలో ఆనంద బాబు పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు సైకిళ్లపై జాతీయ జెండాలతో పాల్గొని దేశభక్తి నినాదాలు చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు.

కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, మహిళలు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాలతో నిర్వహించిన ర్యాలీలు దేశభక్తి నినాదాలతో ఉత్సాహభరితంగా సాగాయి. దేశభక్తి, ఐక్యత, అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత అనే స్ఫూర్తితో ప్రజల భాగస్వామ్యంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఒకేసారి మున్సిపల్ సమరం!

(మొదటి పేజీ తరువాయి)

భూమిపై పేరుకుపోయిన 85 లక్షల టన్నుల చెత్తను ఇప్పటికే పూర్తిగా తొలగించామని మంత్రి తెలిపారు. మున్సిపాలిటీల్లో ఇంకా మిగిలి ఉన్న 70 లక్షల టన్నుల చెత్తను అక్టోబర్ నాటికి పూర్తిగా తొలగిస్తామని వెల్లడించారు.

వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటు

2014-19 మధ్య కాలంలో రాష్ట్రంలో 10 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. అయితే గత ముఖ్యమంత్రికి సరైన అవగాహన లేకపోవడంతో ఆ ప్లాంట్లను రద్దు చేశారన్నారు. ప్రస్తుతం కడప, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, విజయవాడ, పెద్దాపురం ప్రాంతాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వివరించారు. పెద్దాపురంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ పూర్తయిన వెంటనే రాజమహేంద్రవరం నుంచి వచ్చే చెత్తను అక్కడికి తరలిస్తామని తెలిపారు.

**107 మున్సిపాలిటీల్లో ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు** : వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు పూర్తయ్యేలోగా వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టేందుకు రాష్ట్రంలోని 107 మున్సిపాలిటీల్లో ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. సెప్టెంబర్ నెలాఖరులోగా ఈ ప్లాంట్ల నిర్మాణాన్ని పూర్తి చేసి ఘన వ్యర్థాల నిర్వహణను చేపడతామని వెల్లడించారు.

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గం ప్రకటించిన పీవీఎన్ మాధవ్

- 103 మందికి అవకాశం.. 68 మంది కార్యవర్గ సభ్యులు, 3 శాశ్వత, 32 ప్రత్యేక ఆహ్వానితుల నియామకం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ )**: భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై సమర్థవంతమైన పోరాటం, రాష్ట్రంలో బీజేపీ విస్తరణ లక్ష్యంగా మొత్తం 103 మందితో కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తూ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్త కార్యవర్గంలో 68 మందిని రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, ముగ్గురిని శాశ్వత ఆహ్వానితులుగా, 32 మందిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ సామాజిక, ప్రాంతీయ సమతుల్యతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

గుంటూరు జిల్లాకు ఇద్దరికి అవకాశం

రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా గుంటూరు జిల్లా నుంచి యడ్లపాటి స్వరూపారాణి, పాలపాటి రవికుమార్ ఎంపికయ్యారు. ప్రత్యేక ఆహ్వానితుల జాబితాలో గుంటూరుకు చెందిన జూపూడి రంగరాజుకు స్థానం లభించింది.

శాశ్వత ఆహ్వానితులు వీరే

శాశ్వత ఆహ్వానితులుగా దగ్గుబాటి పురందేశ్వరి, సోము వీర్రాజు, ఎన్. కిరణ్ కుమార్ రెడ్డిని నియమించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా సి.ఎం. రమేష్, జి.వి.ఎల్. నరసింహారావు, టి.జి. వెంకటేష్, కామినేని శ్రీనివాస్, ఆర్. కృష్ణయ్య, వై.ఎస్. చౌదరి, జూపూడి రంగరాజు తదితర సీనియర్ నాయకులకు చోటు కల్పించారు.

రాష్ట్రంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పీవీఎన్ మాధవ్ ఆకాంక్షించారు.

## పోలవరానికి 'ఫైనల్ టచ్'

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటి వరకు 77% పూర్తి చేయడం జరిగిందని స్పష్టం చేశారు. మిగిలిన బ్యాలెన్స్ పనులు కూడా త్వరితగతిన, అంటే ఇచ్చినటువంటి షెడ్యూల్ ప్రకారమే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అందులో ముఖ్యంగా ఆర్ అండ్ ఆర్, అదేవిధంగా భూసేకరణకు సంబంధించి,కాలనీలకు సంబంధించిన పనులు డిసెంబర్ నాటికి పూర్తయ్యే విధంగా అంటే ప్రాజెక్టును ప్రారంభించడానికి ఆరు నెలలు ముందుగానే ఒక షెడ్యూల్ ని కూడా రూపొందించుకుని, ఆ షెడ్యూల్ ప్రకారం ఆర్ అండ్ ఆర్, భూసేకరణ, కాలనీలు పూర్తి కావాలని సిఎం చంద్రబాబు నాయుడు గారు ఆదేశించారని తెలిపారు.

అదేవిధంగా పోలవరం అనేది ఒక ఇరిగేషన్ ప్రాజెక్టుగానే కాదు, భవిష్యత్తులో ఒక టూరిజం హబ్ గా కూడా చేసేవిధంగా, 10,000 ఎకరాలతో రేడియల్ సర్వే చేసి, అభివృద్ధి చేయడంతో పాటు, పోలవరం స్పిల్ వే కి సంబంధించి బ్యూటిఫికేషన్, అదేవిధంగా కనెక్టివిటీ బ్రిడ్జ్ ని కూడా ఐకానిక్ మోడల్ లో తయారు చేసుకోవడం, హైవేస్ కనెక్టివిటీ గాని, పోలవరం ప్రాజెక్ట్ నుంచి భద్రాచలం వరకు కూడా రివర్ బేస్డ్ టూరిజాన్ని అభివృద్ధి వంటి అంశాలపై చర్చించడం జరిగిందని అన్నారు.

**2027 మార్చి నాటికే పోలవరం పూర్తి**: ఈవిధంగా పోలవరం ప్రాజెక్టుకు వాస్తవంగా ఇచ్చినటువంటి షెడ్యూల్ 2027 డిసెంబర్, కానీ చంద్రబాబు నాయుడు గారు పుష్కరాలు వస్తూ ఉన్నాయి కాబట్టి, పుష్కరాల కంటే ముందుగానే పూర్తి చేయండి, మార్చి నెలకే అని ఆదేశాలు ఇచ్చారని, దాని ప్రకారమే ఈ 2027 మార్చి కల్లా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే లక్ష్యంగానే పనులు జరుగుతూ ఉన్నాయని పేర్కొన్నారు. అందులో భాగంగానే ఇటీవల మొదటి సారి, గోదావరికి 14 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినటువంటి పరిస్థితిలో కూడా పనులు ఆగకుండా జరుగడం పట్ల సిఎం చంద్రబాబు అభినందించారని తెలిపారు. అందుకే గ్యాప్-1 ఈసిఆర్ఎఫ్ పనులు 48%, గ్యాప్-2 ఈసిఆర్ఎఫ్ పనులు 36% పూర్తయ్యాయని వివరించారు. ఈవిధంగా ఈసిఆర్ఎఫ్ డిజైన్స్ ప్రకారం 45.72 మీటర్లకు పూర్తి చేసుకోగలుగుతున్నామని, ఈసిఆర్ఎఫ్ డ్యాం నిర్మాణం వల్ల ఆప్రాంతంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న గండిపోచమ్మ దేవాలయాన్ని పరిరక్షిస్తూ,స్థానికుల సెంటిమెంట్ ను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలని సిఎం ఆదేశించారని అన్నారు మంత్రి నిమ్మల.

పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం ప్రశ్నార్థకం చేసిందని ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేమన్న దశ నుంచి, 2027 కల్లా పోలవరాన్ని పూర్తి చేస్తున్నాము అనేటటువంటి భరోసాను ప్రజలకు కల్పించామని స్పష్టం చేశారు.

అదేవిధంగా పోలవరానికి సంబంధించిన ఎడమ ప్రధాన కాలువ(రావీజ) 2019 - 2024 ఐదు సంవత్సరాల్లో గత ప్రభుత్వం ఎక్కడా కూడా ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని మంత్రి పేర్కొన్నారు. ఉత్తరాంధ్రాకి సాగునీరు, తాగునీరు,విశాఖపట్నానికి పారిశ్రామిక అవసరాలకు సైతం నీళ్ళిచ్చే పోలవరం ఎడమ ప్రధాన కాలువను ఐదు సంవత్సరాలు గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి, ఆ ప్రాజెక్టుని నీరుగారిస్తే, మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 1500 నుండి 1800 కోట్ల రూపాయలు ఖర్చుచేసి, ఎల్ఎంసి (లెఫ్ట్ మెయిన్ కెనాల్) చాలా క్రిటికల్ వర్క్స్ తో పాటు, 11 చోట్ల నేషనల్ హైవేస్ క్రాస్ చేసేటటువంటి క్రిటికల్ వర్క్స్ ని సైతం అధిగమించామని అన్నారు. పంపా,తాండవ,ఏలేరు రిజర్వాయర్ అదేవిధంగా వరాహ ఇటువంటి నదులను అన్నీ కూడా, క్రాస్ చేసేటటువంటి కెనాల్ వర్క్స్ గాని, ఇలా క్లిష్టమైన పనులను కేవలం రెండేళ్ళలోనే పూర్తి చేసుకుని, ఈ నెలాఖరు కల్లా ఆ పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ నుండి నీటిని విడుదల చేసి, ఉత్తరాంధ్రాకి అనకాపల్లి వరకు కూడా గోదావరి జలాలు తీసుకెళ్లే పనులు పూర్తి చేస్తున్నామని మంత్రి నిమ్మల తెలిపారు.

**విశాఖ డేటా సెంటర్లకు గోదావరి జలాలు** : కొంతమంది వైసిపి పార్టీ నాయకులు మాట్లాడుతూ విశాఖపట్నంలో గూగుల్ తో పాటు వచ్చే ఇతర డేటా సెంటర్స్ కు నీళ్లే లేవని మాట్లాడుతూ ఉన్నారు. వాళ్ల పరిపాలన ఉంటే అట్లానే ఉంటుంది. కానీ ఈరోజు పరిపాలన కూటమి ప్రభుత్వ పరిపాలన,చంద్రబాబు నాయుడు గారి పాలన. ఈరోజు పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ తోటి విశాఖకి గాని, ఉత్తరాంధ్రాకి గాని పుష్కలంగా నీరు వస్తుంది. గూగుల్ గాని, ఇతర డేటా సెంటర్స్ గాని మొత్తం సంవత్సరానికి మూడు టిఎంసి ల నీళ్లు అవసరం అవుతాయని, ఆనీటిని పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అందిస్తామని అన్నారు.

**వెలిగొండ నిర్వాసితులకు 600 కోట్లు క్లియర్ చేయబోతున్నాం** : మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టు. ఆ వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి కూడా హెడ్ రెగ్యులేటర్స్, టన్నెల్స్ లో లైనింగ్, బెంచింగ్, ఫీడర్ కెనాల్ కి సంబంధించినటువంటి సిసి వాల్, ఫీడర్ కెనాల్ సిసి లైనింగ్, నల్లమల సాగర్ కి సంబంధించినటువంటి రెగ్యులేటర్స్ పనులన్నిటినీ కూడా ఈ నెల 25కి పూర్తి చేసుకుంటూ, దానితో పాటుగా. టన్నెల్-2 లో చిక్కుకున్నటువంటి టిబిఎమ్ మిషన్ కూడా, దగ్గర దగ్గర 1900 టన్నుల ఐరన్ కి గానూ, ఇప్పటికీ 1500 టన్నులు తొలగించామని చెప్పారు.

# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

### - యుఎస్పిసి ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతి



**పాలేరు ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** పాఠశాల విద్య, ప్రభుత్వ ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని నేలకొండపల్లి మండల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యఎస్పిసి) డిమాండ్ చేసింది. సమస్యల పరిష్కారం కోసం దశల వారి పోరాట కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక తహసిల్దార్ కి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. పెండింగ్లో ఉన్న పిఆర్సి,డిఏ లను వెంటనే ప్రకటించాలని, సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి,టెట్ పరీక్షల నిర్వహణ లో న్యాయబద్ధమైన విధానాలు పాటిస్తూ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, సకాలంలో యూనిఫామ్ అందజేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే దశల వారిగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు టి.వెంగళరావు, కట్టా పద్మ, ఆర్.అరవింద్ కుమార్,యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల జే.జ్యోతి,తొర్తి గురవయ్య, టిపిటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరావు, రామారావు, గోపాల రావు, మురళి, రాంబాబు, వెంకటరమణ, ప్రతిమ, జి.భవాని, బి.నాగేశ్వరావు, బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, రవి, గణేష్, చిన్న, అనిల్ కుమార్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ భద్రతపై విద్యార్థులకు అవగాహన



**కరీంనగర్ ప్రతినిధి, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు సైబర్ భద్రతపై పూర్తి అప్రమత్తతతో ఉండాలని నిపుణులు సూచించారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ (స్వయంప్రతిపత్తి) కళాశాలలో గురువారం విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ఖాతాల భద్రత, వ్యక్తిగత సమాచారాన్ని పరిరక్షించుకోవడం, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా బలమైన, సంక్లిష్టమైన పాస్‌వర్డ్‌లను వినియోగించాలని, అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించాలని సూచించారు. అలాగే ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని సైబర్ నేరాలపై తమ ప్రతిభను చాటుకున్నారు. పోస్టర్ ప్రజెంటేషన్లు, స్కిట్ల ద్వారా ఆన్‌లైన్ మోసాలపై ప్రతి ఒక్కరికీ సులభంగా అర్థమయ్యే రీతిలో సందేశాన్ని అందించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకతను తమ ప్రదర్శనల ద్వారా వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న సబ్ ఇన్‌స్పెక్టర్ అనూష, కోఆర్డినేటర్ డా. డి. శ్రీనివాస్ మాట్లాడుతూ సైబర్ మోసాలకు గురికాకుండా ప్రతి ఒక్కరూ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ వేదికలపై ఏదైనా అనుమానాస్పద కార్యకలాపం లేదా మోసం ఎదురైతే వెంటనే పోలీసులకు లేదా సైబర్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జె.అనిత, స్వరూప, అలేఖ్య, జి. రాజశేఖర్, ఎం.హరికృష్ణ, జె.కిషోర్ తదితర లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు తెలిపారు. "సైబర్ భద్రత మనందరి బాధ్యత.. అప్రమత్తతే ఆన్‌లైన్ మోసాలకు రక్షణ" అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## పొలంలో నవజాత శిశువు మృతదేహం లభ్యం..

### - వైద్యారోగ్యశాఖ, పోలీసుల సంయుక్త దర్యాప్తు ముమ్మరం



**పాలేరు ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** కూసుమంచి మండల కేంద్రంలోని శివాలయం పరిసరాల వద్ద స్థానిక రజక బజార్ వెనుక గల పొలంలో నెల్లూరి వెంకటే శ్వర్లు అనే రైతు గురువారం తన పొలం దున్నుతుండగా నవజాత మగ శిశువు మృత దేహం కనిపించింది. వెంటనే సదరు రైతు అధికారులకు, పోలీసులకు సమా చారం ఇవ్వగా కూసుమంచి ఎస్ఐ దివ్యశ్రీ, మండల వైద్యాధికారి సాయి కుమార్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. డాక్టర్ సాయి కుమార్ మాట్లాడుతూ.. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల ద్వారా సమాచారం అందడంతో తాను సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి వెళ్లినట్లు వైద్యాధికారి వెల్లడించారు. పొలాల్లో శిశువు మృతదేహం కనిపించడంతో స్థానికంగా కలకలం రేగింది. ప్రాథమిక పరిశీలన ప్రకారం.. ఎవరో ఇంటి వద్దే అబార్షన్ చేయించుకుని, అనంతరం మృత గర్భస్థ శిశువును పొలాల్లో పడేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. అయితే శిశువు మృతికి అసలు కారణం ఏమిటి..? అబార్షన్ ఎక్కడ, ఎవరి ద్వారా జరిగింది..? మృతదేహాన్ని పొలాల్లోకి ఎవరు తీసుకొచ్చి పడేశారు..? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కూడా వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఘటనాస్థలిలో పంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు డాక్టర్ సాయికుమార్ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మృతదేహం వయస్సు, మరణానికి గల కారణాలు తదితర అంశాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని వైద్యాధికారి తెలిపారు.

## బాధ్యతతో కూడిన నాయకత్వమే నిజమైన నాయకత్వం



**మణికొండ, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** మణికొండ తానిషా నగర్ హుడా కాలనీ లోని లోటస్ స్కూల్‌లో గురువారం విద్యార్థుల ఇన్వెస్టిచర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించే సందేశాన్ని అందిస్తూ, విద్యార్థుల స్కూల్ క్యాబినెట్‌కు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులను గుర్తించిన పాఠశాల చైర్మన్ రవికుమార్, సీతారాం ధూళిపాళ, సీతారాం దాస్, కృష్ణ కుమార్ విద్యార్థులకు బ్యాడ్జీలు, పాఠశాల జెండాలను సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ నాయకత్వం అంటే కేవలం ఒక పదవిని చేపట్టడం కాదని, సమస్యలను అర్థం చేసుకుని వాటికి ఆచరణాత్మకమైన పరిష్కారాలను చూపించడం, ఇతరులను కలుపుకుని ముందుకు సాగడం అని విద్యార్థులకు సూచించారు. ఇట్టి ఇన్వెస్టిచర్ కార్యక్రమం నిర్వహించడం పట్ల ఆయన పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. నేటి విద్యార్థి నాయకులే రేపటి బాధ్యతాయుతమైన పౌరులు, నాయకులు అని ఆయన పేర్కొన్నారు. చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఇందిరమ్మ చీరలను అందుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ.. మహిళల సంక్షేమం, సాధికారత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్, మాజీ కౌన్సిలర్ యాలాల లావణ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బషీర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎర్రుపుల కుమార్, లక్ష్మి శ్రీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రవణ్ కుమార్, పుల్లారావు, మణికొండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సావిత్రి, ఏ-బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఇందిరా, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ రైల్వే బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం

**వికారాబాద్ ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మొయినాబాద్ నుంచి వికారాబాద్‌కు ప్రతిరోజూ రాకపోకలు సాగించే జేబీఐటీ కాలేజీ బస్సు టీఎస్ 07 యు ఏ 2097 ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టినట్లు ప్రత్యక్ష సాక్షి తెలిపారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలైనట్లు తెలిపారు ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. అయితే గాయపడిన వ్యక్తి వివరాలు, గాయాల తీవ్రతపై పూర్తి సమాచారం తెలియరాలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆర్జీ-1 ఏరియాలో ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

### - ఆగస్టు 15న బహుమతులు అందజేయనున్న జీఎం లలిత్ కుమార్

**గోదావరిఖని, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రామగుండం ఏరియా-1 పరిధిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉత్తమ ఉద్యోగులను ఘనంగా సన్మానించనున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 15న జీఎం కార్యాలయంలో నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా ఎంపికైన ఉద్యోగులను శాలువాలు,జ్ఞాపికలు బహుమతులతో సత్కరిస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రతిభ కనబరిచిన వి. శంకరయ్య,ఆర్. పోశం (జీడీకే-1&3 ఇన్‌క్లైన్), పి.శంకర్, పి.రాయలింగు (2&2A ఇన్‌క్లైన్), రజాక్, కే.పరశ రాములు ( సీఎం 2, 2A & 5), టి.రాజేష్, ఎస్. శ్రీనివాస్ (జీడీకే-11 ఇన్‌క్లైన్) సన్మానం అందుకోనున్నారు.

కాగా, కార్పొరేట్ స్థాయిలో ఉత్తమ ఎన్ సి డబ్ల్యూ ఏ ఉద్యోగులుగా ఎంపికైన దారూరి వేణు (డిప్యూటీ సూపరింటెండెంట్), కొట్టే సుధాకర్ (రామ్‌కార్ ఆపరేటర్, జీడీకే-11 ఇన్‌క్లైన్) కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ సీ అండ్ ఎండి,ఇతర డైరెక్టర్ల చేతుల మీదుగా ప్రత్యేక సన్మానం పొందనున్నారు. ఈ సందర్భంగా జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగుల క్రమశిక్షణ, అంకితభావం సంస్థ అభివృద్ధికి ఎంతో కీలకమని, మిగతా వారికి ఇవి స్ఫూర్తిగా నిలుస్తాయని కొనియాడుతూ ఎంపికైన వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### శాశ్వత పరిష్కారం కోసమే

## భూ రీ సర్వే : తహసీల్దార్ డీ.సైదులు

### - భగత్ వీడులో రెవెన్యూ బృందాలతో రీ సర్వే ప్రారంభం



**పాలేరు ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** సమగ్ర భూ రీ సర్వేతో భూ యాజమన్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని కూసుమంచి తహసీల్దార్ డీ.సైదులు తెలిపారు. గురువారం భగత్ వీడు గ్రామంలో భూ సమగ్ర సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సరిహద్దు, యాజమాన్య సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్రంలో ప్రతి భూమిని ఆధునిక టెక్నాలజీ, రోవర్స్ సహాయంతో రీ సర్వే చేసి భూ ఆధార్ తో కూడిన యాజమాన్య హక్కులను కల్పించుటకు నిర్ణయించారన్నారు. అందులో భాగంగానే గురువారం భగత్ వీడు రెవెన్యూ గ్రామంలో పది సర్వే, రెవెన్యూ బృందాలతో రీ సర్వే కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని భూ యజమానులందరూ వినియోగించుకొని, భూ సర్వే కు తమ వద్ద ఉన్న భూమికి సంబంధించిన ఆధారాలతో సమాచారం ఇచ్చిన సమయానికి ప్రదేశంపై హాజరై సర్వేకు సహకరించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు మేలు చేయుటకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీ ల్యాండ్ సర్వే రాజేందర్, తహసీల్దార్ సైదులు, సర్పంచ్ వసంత లక్ష్మి, సర్వే టీంలు రెవెన్యూ సిబ్బంది, సంబంధిత రైతులు పాల్గొన్నారు.

## మణికొండలో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ



**మణికొండ, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** మణికొండ డివిజన్ పరిధిలో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణ రెడ్డి పాల్గొని మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఇందిరమ్మ చీరలను అందుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ.. మహిళల సంక్షేమం, సాధికారత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్, మాజీ కౌన్సిలర్ యాలాల లావణ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బషీర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎర్రుపుల కుమార్, లక్ష్మి శ్రీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రవణ్ కుమార్, పుల్లారావు, మణికొండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సావిత్రి, ఏ-బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఇందిరా, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గీతన్నల చైతన్య యాత్ర



**కోహెడ, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ గీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో.. కోహెడ మండలంలో చేపట్టిన 'బస్ అవగాహన యాత్ర' (బస్ ప్రచారం) పోస్టర్‌ను గురువారం ఆ సంఘం సభ్యులు ఆవిష్కరించారు. ఈ నెల 2న ప్రారంభమైన ఈ ప్రచార కార్యక్రమం, 18వ తేదీన హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద జరిగే బహిరంగ సభతో ముగుస్తుందని రాష్ట్ర కమిటీ సభ్యుడు పచిమట్ల రవీందర్ తెలిపారు. అలాగే, గీత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

### : తహసీల్దార్‌కు యూఎస్‌పీసీ వినతిపత్రం



**గోదావరిఖని, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) పిలుపుమేరకు ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రికి ఉద్దేశించిన వినతిపత్రాన్ని గురువారం రామగుండం తహసీల్దార్‌కు అందజేశారు. **ప్రధాన డిమాండ్లు:** ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వెంటనే నూతన పీఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ లను వెంటనే విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. జీవో 25ను సవరించడంతో పాటు, 2003 ఉపాధ్యాయులకు జీవో 57 అమలు చేయాలని, రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. అలాగే ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్ విధివిధానాలను స్పష్టంగా రూపొందించి హెల్త్ కార్డులు అందజేయాలని, సర్వీసులో ఉన్నవారితో పాటు రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలు చెల్లించేందుకు నెలకు రూ.2,000 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యుఎస్పిసి, డిటిఎఫ్, నాయకులు సుదర్శన్ రెడ్డి, కిరణ్ కుమార్, ఉమామహేశ్వర్, రమేష్, వసుంధర, ప్రమీల, చంద్రశేఖర్, స్నేహలత, లావణ్య, లక్ష్మణ్ కుమార్, ప్రశాంత్, దేవికలతో పాటు పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### గురువుపై అభిమానంతో

## విద్యార్థులకు నిత్యావసరాల పంపిణీ

### : యూట్యూబ్ స్టార్ వర్మని వర్షిని ఆధ్వర్యంలో అమరేందర్ జన్మదిన వేడుకలు



**గోదావరిఖని, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** గురువుపై ఉన్న పూజ్యభావంతో,ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు సేవ చేయడం నిజమైన గురుదక్షిణ అని నిరూపించారు వర్మని వర్షిని. గురువారం, రెయిన్బో స్కూల్ అధినేత పి.ఎస్.అమరేందర్ పుట్టినరోజు సందర్భంగా, ఆయన ప్రియశిష్యురాలైన యూట్యూబ్ స్టార్ వర్షిని ఆధ్వర్యంలో సంజయ్ గాంధీ నగర్‌లోని ప్రాథమిక పాఠశాల పిల్లలకు ఉచితంగా వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ముందస్తు షెడ్యూల్ కారణంగా స్వయంగా హాజరుకాలేక పోయిన వర్షిని, ఫోన్ సందేశం ద్వారా అమరేందర్ కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.."మాతా పితల తర్వాత సమాజంలో గురువు స్థానం అత్యున్నతమైనది. గురువుల మార్గదర్శకత్వంలో ఎదగడం ఒక గొప్ప సువర్ణ అవకాశం" అని పేర్కొన్నారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన దయానంద్ గాంధీ, సర్వేశ్ మాస్టర్, వేణుమాధవ్, కిషోర్, పాఠశాల ఉపాధ్యాయ బృందానికి, సహకరించిన ప్రతి ఒక్కరికీ వర్షిని ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# అవయవ దానంపై అవగాహన




**ఓదెల, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** ఓదెల ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓదెల కస్తూర్బా కళాశాలలో గురువారం నేత్ర, అవయవ, శరీర దానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి మాట్లాడుతూ 2008 నుంచి ఇప్పటివరకు 1,640 నేత్రదానాలు, 160 దేహదానాలు, 95 అవయవదానాలు జరిగాయని తెలిపారు.మండలం నుంచి 250కిపైగా నేత్రదానాలు జరగడం, ఓదెల, అబ్బిడిపల్లి గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో మరణానంతరం నేత్రదానం చేస్తామని గ్రామస్థులు తీర్మానించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వనజ, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, ప్రిన్సిపాల్ కె. జ్యోతి, ఎస్వో, డాక్టర్ ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, క్యాతం మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



**ఓదెల, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో గురువారం ఓదెల తహసీల్దార్‌కు ముఖ్యమంత్రి పేరిట మెమోరాండం సమర్పించారు.

పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏల విడుదల, జీవో 25 సవరణతో పాటు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఎంప్లాయీ హెల్త్ స్కీమ్ అమలు చేసి హెల్త్ కార్డులు జారీ చేయాలని, ఉద్యోగుల పెండింగ్ బకాయిలు చెల్లించేందుకు నెలకు రూ.2 వేల కోట్లు విడుదల చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 19న జిల్లా స్థాయిలో, 29న రాష్ట్ర స్థాయిలో ధర్నాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ నాయకులు పి. అశోక్‌రెడ్డి, అమృత కిషోర్, తంగళ్లపల్లి సురేష్ తదితరులు

## విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ సిబ్బందిపై దాడి

### : నిందితుడికి ఆరు నెలల జైలు, జరిమానా

**గోదావరిఖని, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ శాఖ సిబ్బందిపై దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వెంకట సునీల్ రెడ్డి తీర్పు వెలువరించారు. 2018వ సంవత్సరంలో ఎన్టిపిసి పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్యాపూర్ లో విద్యుత్ బిల్లుల వసూలు కోసం వెళ్లిన విద్యుత్ శాఖ సిబ్బందిపై బరిగెల వెంకటేష్ అనే వ్యక్తి ఇటుక రాయితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటనపై అప్పట్లో ఎన్టిపిసి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

నాటి ఎస్సైలు పి.చంద్రకుమార్, టి.శంకరయ్య కేసు నమోదు చేసి సమర్థవంతంగా దర్యాప్తు జరిపి నిందితుడిపై కీలక సాక్ష్యా ధారాలను సేకరించారు. ప్రస్తుతం ఎన్టిపిసి సీఐ కృష్ణకుమార్, ఎస్సై ఉదయ్ కిరణ్ ల ఆధ్వర్యంలో సేకరించిన ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టగా, ప్రాసిక్యూషన్ తరపున నహేదా పర్వీన్ బలమైన వాదనలు వినిపించారు.నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి శిక్ష ఖరారు చేశారు. ఈ కేసు విచారణలో ప్రతిభ కనబరిచి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, హోంగార్డ్ పి. శ్రీనివాస్, లైజన్ ఆఫీసర్ ఎన్.శంకర్‌లను పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

# భవిత కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- ఫర్నిచర్, బెంచీలు ఎక్కువ ఉంటే మరో స్కూల్‌కు తరలించాలి
- వనరులను సమర్థవంతంగా వినియోగించాలి..
- కలెక్టర్ చిత్రా మిశ్రా..

కరీంనగర్ ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రం లోని ధన్గర్ వాడీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. భవిత కేంద్రంలో గదులు కలియ తిరుగుతూ రిజిస్టర్ పరిశీలిం చారు. పిల్లలు, సిబ్బంది వివరాలు, చిన్నారులకు అందిస్తున్న ఫుడ్ వివరాలు, ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకు న్నారు. జిల్లాలోని 16 భవిత కేంద్రాల్లో తాగునీరు (వాటర్ డిస్పెన్సరీలు) ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడి ప్రత్యేక అవస రాలు గల విద్యార్థులకు సైతం యూనిఫామ్, పుస్తకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రంలో పేరెంట్స్ వెయిటింగ్ రూమ్, ప్రత్యేక వాష్ రూమ్, ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక ప్లేట్లు, గ్లాసులు అందించా లన్నారు. ప్రతి భవిత కేంద్రంలో సరిపడా సిబ్బంది(సమ్మిళిత విద్యా బోధకులు) ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి గదులు పరిశీలించారు.. అందిస్తున్న సౌకర్యాలు తెలుసు కున్నారు. పాఠశాలలో వృధాగా ఫర్నిచర్, బెంచీలు ఉండటం పై అసహన వ్యక్తం చేశారు.



ఏర్పాట్లు చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిరు పయోగంగా ఉన్న ఫర్నిచర్, బెంచీలను అవసరమైన పాఠశాల లకు తరలించాలని ఆదేశించారు. పిల్లలు కింద కూర్చోకుండా విధిగా బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. స్క్రాప్‌ను తొల గించి పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఉన్న వనరులను వృధాగా ఉంచకుండా వినియోగంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

**అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ సందర్శన..**

ఆ తర్వాత డాక్టర్ స్ట్రీట్‌లో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ను కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. స్కూల్ భవనం శిథిలావస్థకు చేరినందున.. మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. అప్పటివరకు తాత్కాలికంగా ముకరంపురలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్లోకి ఈ స్కూల్ ను తరలించాలని సూచించారు.

విద్యార్థులతో మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. హై స్కూల్ తరగతి గదులు శిథిలావస్థకు చేరినందున తొలగించి.. పెద్ద భవనం నిర్మించాలన్నారు. భవనం చుట్టూ ప్రహరీ, అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. స్మార్ట్ సిటీ కింద ఏ పాఠశాలల్లో ఎన్ని నిధులు ఖర్చు చేశారో నివేదిక అందించాలని అధికారులకు సూచించారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదు

- అధికారులకు సూచనలు చేసిన నగర ట్రాఫిక్ డీసీపీ-3 అధికారి రాహుల్ హెగ్డే

హైదరాబాద్, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) : రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో అవరమైన ఏర్పాట్లు చేయాలని నగర ట్రాఫిక్ డిసిపి - 3, ఐపిఎస్ అధికారి రాహుల్ హెగ్డే, జీహెచ్‌యంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కన్నం సత్యనారాయణలు అధికారులను ఆదేశించారు. రానున్న వినాయక చవితి - 2026 ఉత్సవాలను పురస్కరించుకొని చాంద్రాయణగుట్ట నర్కి పూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో గురువారం ఉదయం ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, జోనల్ కమిషనర్ సత్యనారాయణల ఆధ్వర్యంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతి నిధులు, పలు విభాగాల అధికారులతో సమ న్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. జోనల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఉత్సవ సమితి సభ్యులు ఈ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా డీసీపీ రాహుల్ హెగ్డే, జోనల్ కమిషనర్ సత్య నారాయణలు మాట్లాడుతూ... సమావేశంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలపై అన్ని ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడతామన్నారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో అవసరమైన




ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇటీవల పలు ప్రధాన మార్గలో రోడ్ల పైకి ఉన్న చెట్ల కొమ్మలను తొలగించామన్నారు. రోడ్లు, వీధి దీపాలు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు. ఉత్సవాలకు తమ పరిధిలో ప్రత్యేక గణేష్ యాక్షన్ టీం బృందాలను ఏర్పాటు చేసి ఎప్పటికపుడు చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గణేష్ శోభాయాత్రలు కొనసాగే ప్రధాన రోడ్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి కొడి మహేందర్, ఉత్సవ సమితి నాయకులు ఆలే భాస్కర్ రాజ్, నిరంజన్ యాదవ్, మహేశ్వర్, రూప్ రాజ్, శ్రీకాంత్ రెడ్డి, ప్యారసాని వెంకటేష్, ముకేశ్ యాదవ్, చార్మినార్ జోన్ అదనపు డీసీపి మహమ్మద్ అబ్దుల్ మాజీద్, ఏసీపిలు చంద్రశేఖర్, శ్యామ్ సుందర్, రాజా వెంకట్ రెడ్డి, చంద్రశేఖర్, చంద్రకుమార్, ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్, యాకుత్ పురా, మలక్ పేట్, సంతోష్ నగర్, ముసారం బాగ్, చార్మినార్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు సుభాష్ రావు, ఇన్ కేశఫ్ అలీ, భాస్కర్ రెడ్డి, మంగతాయారు, రాజు, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ ఇందిరా బాయి , జలమండలి సీజీయం జాన్ షరీఫ్ , డీజీయంలు మోహన్ రాజ్, అబ్దుల్ హకీమ్, ఈఈ లు, డిఈ లు, స్ట్రీట్ లైట్ ఎలక్ట్రికల్, మలేరియా, పారిశుధ్య, విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

మంచిర్యాల ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, పౌష్టికాహారం, శు ద్ధమైన త్రాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని సందర్శించి పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, తరగతి గదులు, భోజనశాల, వంటశాల, త్రాగునీటి వసతి, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల స్థాయికి అనుగుణంగా, వారికి సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని, విద్యార్థులలో చదువుపై ఆసక్తిని పెంపొందించే విధంగా బోధనా పద్ధతులను అవలంబించాలని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం సకాలంలో అందించాలని, విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో శుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పాఠశాల పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పారిశుద్ధ్య చర్యలను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటులో భాగంగా బెల్లంపల్లి నియోజకవర్గానికి కేటాయించిన పాఠశాల నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ పాఠశాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. వివిధ ధ్రవపత్రాల కొరకు అందిన దరఖాస్తులను



నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అధికారులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి మండల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. అనంతరం కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు సైకిళ్లు, కుట్టుమిషన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు మదాసి రమాదేవి బాల్య మిత్రురాలు ఎం.టి. రాజేశ్వరి సహకారంతో సుమారు 1 లక్ష 80 వేల రూపాయల విలువ గల సైకిళ్లు, కుట్టుమిషన్ విద్యార్థులకు అందించడం జరిగిందని తెలిపారు. బాలికల విద్యాభ్యాసానికి ఇటువంటి సహకారం అందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందిస్తూ వారి ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను సందర్శించి ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామపంచాయతీని సందర్శించి గ్రామంలోని పారిశుధ్య నిర్వహణ, ఇటీవల కురిసిన వర్షాలతో ఏర్పడిన పరిస్థితులను పరిశీలించారు. గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన,గ్రామసభ అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా డి.సి.ఈ.బి. కార్యదర్శి పి.మహేశ్వరరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థను బలోపేతం చేస్తున్నాం..

- రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

మంచిర్యాల ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా అన్నారు. గురువారం హైదరాబాద్ లోని ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిల్లా విద్యాధికారులు, మండల విద్యాధికారుల ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్, ఎస్ సి ఆర్ టి సంచాలకులు జి.రమేష్ , ఎ ఎస్ పి డి శ్రీహరి లతో పాటు విద్యార్థుల నమోదులో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల గత విద్యా సంవత్సరం కంటే 10 శాతం విద్యార్థులను నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని, మంచిర్యాల జిల్లా 96.16 శాతంతో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. సమాజం దిశను మార్చే ప్రభావవంతమైన విద్యావ్యవస్థకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, తద్వారా క్షేత్రస్థాయి ఉపాధ్యాయుడు నుండి జిల్లా విద్యాధికారి వరకు అందరి సమన్వయంతో ప్రణాళికబద్ధంగా విద్య వ్యవస్థను పటిష్టం చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో జిఅఎంఖు వ్యవస్థ అభివృద్ధిలో అవలంబించిన విధానాలు, చేపట్టిన కార్యక్రమాలు, పాటించిన ప్రత్యేక వ్యూహాలు, నిర్వహించిన వినూత్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులతో విద్యా శాఖలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించడంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ పై విద్యార్థుల తల్లిదండ్రులలో నమ్మకం కలిగి మంచిర్యాల జిల్లాలో 4 వేల 9 మంది ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో చేరారని తెలిపారు. ప్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభించడం, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల బాలికల వసతి గృహాలలో మెరుగైన మౌలిక వసతుల కల్పనతో



విద్యార్థుల చేరికలు అధికంగా జరిగాయని తెలిపారు. అంగన్వాడీ సిబ్బందితో సమన్వయం చేసుకోవడం వలన ప్రాథమిక పాఠశాలలు, ప్రీ ప్రైమరీ పాఠశాలలలో నమోదు పెరగడం, ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరిన సందర్భంలో యు - డైస్ లో విద్యార్థుల రికార్డు బదిలీ కొరకు చేపట్టిన ప్రత్యేక కార్యాచరణ, పాఠశాల, స్కూల్ కాంప్లెక్స్, మండలాల వారీగా లక్ష్యాన్ని, బాధ్యతలను కేటాయించి పర్యవేక్షించడంతో పాటు లోపాలను సరిదిద్దడం జరిగిందని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలలో 5వ తరగతిలో ఉన్న విద్యార్థులను సమీప ఉన్నత పాఠశాలలను సందర్శించి అందుతున్న సౌకర్యాలు తెలుసుకునేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రతి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తన పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను స్వయంగా దగ్గరుండి సమీప ప్రాథమికోన్నత/ఉన్నత పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకున్నామని, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తన పాఠశాలలో 7వ /8వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఉన్నత పాఠశాలలలో చేర్పించేలా ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. 2025-26 లో అత్యధిక విద్యార్థుల నమోదు చేసిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులచే ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో చర్చించడం, ప్రభుత్వ పాఠశాలలలో అమలవుతున్న కార్యక్రమాలు, అందుతున్న సౌకర్యాల పట్ల తల్లిదండ్రుల సమావేశంలో అవగాహన కల్పించడం వంటి చర్యల ద్వారా అత్యధిక విద్యార్థుల నమోదు సాధ్యమైందని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 33 జిల్లాల జిల్లా విద్యాధికారులు, 630 మంది మండల విద్యాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కన్నుమూసిన కేసీఆర్ బావమరిది..

- యశోద ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన శ్రీనివాస్ రావు
- ఆస్పత్రికి వెళ్లిన కేటీఆర్, హరీష్ రావు..
- కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎర్రబెల్లి
- అమెరికా నుంచి కుమారుడు వచ్చాక అంత్యక్రియలు..

హైదరాబాద్, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బావమరిది, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయా కర్ రావుకు సమీప బంధువైన జోగినపల్లి శ్రీనివాస్ రావు అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అస్వస్థతతో బాధ పడుతున్న ఆయన సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ



కన్నుమూశారు. ఆయన కుమారుడు అమెరికాలో ఉన్నారు. ఆయన వచ్చాక అంత్యక్రియలు నిర్వ హించనున్నట్టు తెలిసింది. కేటీఆర్‌కు స్వయాన మేన మామ.. శ్రీనివాస్ రావు మరణం నేపథ్యంలో కేటీఆర్ గురువారం రోజు హైదరాబాద్లో ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. మరోవైపు మాజీ మంత్రి హరీష్ రావు కూడా తన కార్యక్రమాలను వాయిదా వేసుకుని యశోద ఆసుపత్రి వెళ్లారు. శ్రీనివాస్ రావు మరణవార్త తెలిసిన వెంటనే ఎర్రబెల్లి దయాకర్ రావు హుటాహుటిన యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ శ్రీనివాస్ రావు పార్థివదే హానికి పూలమాల వేసి అశ్రునయనాలతో నివాళులర్పించారు. అనంతరం తీవ్ర శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. శ్రీనివాస్ రావు ఆత్మకు శాంతి చేకూరా లని, వారి కుటుంబానికి ఈ లోటును తట్టుకునే శక్తిని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

### ఆయుష్ వైద్య విద్యార్థుల స్టైపెండ్ పోరాటానికి

# బీఎస్పీ సంపూర్ణ మద్దతు..

- ప్రకటించిన బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్..

హైదరాబాద్, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) : గత పది రోజులుగా స్టైపెండ్ సమస్యపై ఆందోళన చేస్తున్న ఆయుష్ పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్స్ న్యాయమైన డిమాండ్లకు బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన ధర్నా చౌక్ వద్ద విద్యార్థులు చేపట్టిన ఆందోళనలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , "ప్రజల ఆరోగ్యం కోసం వైద్య సేవలు అందిస్తున్న ఆయుష్ విద్యార్థులకు స్టైపెండ్ విషయంలో వివక్ష చూపడం అన్యాయం. ఒకే ప్రభుత్వ వ్యవస్థలో



పనిచేస్తున్న వైద్య విద్యార్థులకు వైద్య విధానం ఆధారంగా వేర్వేరు ప్రమాణాలు ఎందుకు?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఓ 77లో పేర్కొన్న స్టైపెండ్‌ను అమలు చేయడంతో పాటు, ఆయుష్ హౌస్ సర్జన్స్, పీజీ స్కాలర్స్ కు ఇతర వైద్య విద్యార్థులతో సమానంగా న్యాయమైన స్టైపెండ్ అందించాలని ఆయన డిమాండ్ చేశారు. "స్టైపెండ్ అనేది దానం కాదు.. విద్యార్థులు అందిస్తున్న సేవకు ప్రభుత్వం చెల్లించాల్సిన న్యాయమైన ప్రతిఫలం. రాష్ట్రంలో అల్లోపతి వైద్య విద్యార్థుల స్టైపెండ్లను సవరించినప్పుడు ఆయుష్ విద్యార్థులను విస్మరించడం వివక్షకు నిదర్శనం. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలి" అని ఆయన అన్నారు. అలాగే ఆయుష్ రంగానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో సమానమైన కనీస స్టైపెండ్ ప్రమాణాలను తీసుకురావాలని, రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో వెంటనే స్టైపెండ్‌ను సవరించి, అర్హత ఉన్న బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. "వైద్యంలో విధానాలు వేరైనా, వైద్య విద్యార్థుల హక్కులు వేరు కావు. ఆయుష్ విద్యార్థులకు సమాన గౌరవం, సమాన న్యాయం, సముచిత స్టైపెండ్ అందే వరకు బీఎస్పీ వారి దశల వారీ పోరాటానికి వేలాది మంది కార్యకర్తలతో అండగా ఉంటుంది" అని ఇబ్రాం శేఖర్ స్పష్టం చేస్తూ అనంతరం విద్యార్థుల వినతిపత్రాన్న స్వీకరించారు.

# నిరుద్యోగ యువతకు బ్యాంకింగ్, ఇన్సూరెన్స్‌పై శిక్షణ

- మూడు రోజుల అవగాహన కార్యక్రమం విజయవంతం..
- 60 మందికి శిక్షణ.. అర్హులకు ధ్రువీకరణ పత్రాలు



హయత్‌నగర్, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) : నిరుద్యోగ యువతకు బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రూరల్ అప్లిఫ్ట్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లో నిర్వహించిన మూడు రోజుల అవగాహన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో 60 మంది నిరుద్యోగ యువత పాల్గొని బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల్లో కెరీర్ అవకాశాలు, అవసరమైన నైపుణ్యాల అభివృద్ధి, ఎన్ఐఏ అసెస్‌మెంట్ తదితర అంశాలపై శిక్షణ పొందారు. కార్యక్రమం చివరి రోజున నిర్వహించిన ఎన్ఐఏ అసెస్‌మెంట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మేకల వెంకట రెడ్డి మాట్లాడుతూ.. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన బజాజ్ ఫిన్‌సర్వ్ సిఎస్ఆర్, రూరల్ అప్లిఫ్ట్‌మెంట్ ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను భవిష్యత్‌లో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, శిక్షణాదారులు, అభ్యర్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు..

- ట్రాఫిక్ ఏసీపీ జీ.శంకర్ రాజు వెల్లడి..
- విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై పోలీసుల అవగాహన..



హైదరాబాద్, ఆగస్టు 14 (జర్నలిస్ట్ ఫైల్) : మైనర్లు వాహనాలు నడపడం ప్రమాదకరమని చట్టబద్ధమైన వయస్సు వచ్చే వరకు వారు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలలని తిరుమలగిరి డివిజన్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టచేశారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా బోల్లారం ఆర్మీ పబ్లిక్ హై స్కూల్‌లో గురువారం విద్యార్థులకు రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించారు. మల్కాజ్‌గిరి కమిషనర్ బి. సుమతి ఐపీఎస్, ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీసీపీ1, కె. రాహుల్‌రెడ్డి ఐపీఎస్, పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుమలగిరి డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ జీ.శంకర్ రాజు హజరైనారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ....మైనర్లు డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించామని, వారు వాహనం నడపడం వల్ల ప్రమాదాలతో పాటు చట్టపరమైన సమస్యలు కూడా ఎదురువుతాయని పోలీసులు తెలిపారు. నిర్ణీత వయస్సు వచ్చే వరకు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ పొందే వరకు మోటారు వాహనాలు నడపరాదని సూచించారు. నిబంధనలు ఉల్లఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదే విధంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మేట్, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ ధరించాలని సూచించారు. లేన్ క్రమశిక్షణ, ట్రాఫిక్ సిగ్నల్స్, నిర్ణీత వేగ పరిమితులు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు ఇన్స్‌స్పెక్టర్ ఐ.వి. రమణయ్య, పాఠశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.. ఇంటరాక్టివ్ సెషన్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ట్రాఫిక్ నిబంధనలపై ప్రశ్నలు అడిగి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రహదారి భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు నిర్వహించిన కార్యక్రమానికి పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు, విద్యార్థులనుండి విశేష స్పందన లభించిందని ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

## సమిశ్రగూడెం చెరువు సుందరీకరణ, శివాలయ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి దుర్గేష్



- రూ.50 లక్షలతో సమిశ్రగూడెం చెరువు అభివృద్ధి.. త్వరలోనే చిల్డ్రన్ పార్క్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు
- రూ.1.25 కోట్లతో శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణం నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం

**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో సమయం గడిపేలా నిడదవోలు రూరల్ మండలంలోని సమిశ్రగూడెం చెరువును అత్యద్భుతంగా సుందరీకరిస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శుక్రవారం సమిశ్రగూడెం చెరువు వద్ద రూ.50 లక్షల వ్యయంతో జరుగుతున్న ఆధునికీకరణ మరియు రివిట్‌మెంట్ పనులను మంత్రి దుర్గేష్ స్వయంగా పరిశీలించారు. అనంతరం అధికారులతో కలసి నిర్మాణ పనుల మ్యాప్‌ను పరిశీలించి, పనుల పురోగతిపై ఆరా తీశారు. ప్రస్తుతం మట్టితో బండ్ లెవలింగ్ పనులు పూర్తయ్యాయని, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు అనంతరం మరొక దఫా లెవలింగ్ ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. చెరువు వద్ద పిల్లల కోసం చిల్డ్రన్ పార్క్, వ్యాయామ ప్రియుల కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయనున్నట్లు, దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని తెలిపారు. చెరువు మధ్యలో ఉన్న సర్ ఆర్థర్ కాటన్ దొర విగ్రహం వద్దకు సందర్శకులు వెళ్లేందుకు వీలుగా గట్టు నుండి బ్రిడ్జిని నిర్మించాలని స్థానికులు కోరగా, తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి దుర్గేష్ అన్నారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ మరియు ఆధునికీకరణ పనులకు కావలసిన మరో రూ.10 లక్షల అదనపు నిధులను త్వరలోనే సేకరించి కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు.

అనంతరం రూ.1.25 కోట్ల గోదావరి పుష్కరాలు 2027 (సీజీఎఫ్) నిధులతో నిర్మిస్తున్న శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను మంత్రి కందుల దుర్గేష్ పరిశీలించారు. ఆలయ నిర్మాణంలో ఎక్కడా నాణ్యత విషయంలో రాజీ పడకుండా, పనులను త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## ఆగస్టు 17 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పూర్తి స్థాయిలో అమలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** నగరంలో ఆగస్టు 17 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని నగర పాలక సంస్థ ముఖ్య వైద్యాధికారి డాక్టర్ శాంతికళ ఆదేశించారు. కమిషనర్ కే. మయూర్ అశోక్ ఆదేశాల మేరకు శుక్రవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు.

ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని, నిషేధం అమల్లోకి వచ్చిన తర్వాత వినియోగిస్తే అపరాధ రుసుము విధించాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ నివారణకు ఖాళీ స్థలాలు, నీరు నిలిచే ప్రాంతాల్లో దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నగరంలో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా చూడాలని, సైడ్ కాలువలను ప్రతిరోజూ శుభ్రం చేసి వ్యర్థాలను వెంటనే తరలించాలని తెలిపారు. రోడ్లపై గార్బేజ్ పాయింట్లు లేకుండా చూడాలని, ప్రజల నుంచి వచ్చే పారిశుధ్య ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. పారిశుధ్య కార్మికుల హాజరును ఎఫ్ఆర్ఎస్ ద్వారా నమోదు చేయాలని, బల్క్ వేస్ట్ జనరేటర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

డాగ్ ఫీడింగ్ జోన్లపై అవగాహన కల్పించడంతో పాటు ప్రధాన రహదారులపై సంచరించే పశువులను పట్టుకుని బందెల దొడ్డికి తరలించాలని సూచించారు.

సమావేశంలో ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, బయాలజిస్ట్ శేషయ్య, వెటర్నరీ వైద్యులు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## మంగళగిరిలో 20 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ

- 19లోగా దరఖాస్తు చేసుకోవాలి: ఎంఈఓ బాబు

**మంగళగిరి, ( జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి మండల పరిధిలోని ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 20 స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులను గెస్ట్ ఇన్‌స్ట్రక్టర్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బాబు తెలిపారు.

శుక్రవారం వివరాలను వెల్లడిస్తూ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల పరిధిలోని పలు పాఠశాలల్లో హిందీ, తెలుగు, బీఎస్, ఇంగ్లీష్, పీఈటీ, సోషల్ స్టడీస్ తదితర సబ్జెక్టుల్లో పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను పూర్తి చేసి మంగళగిరి మండల విద్యాధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

ఖాళీల వివరాలను ఎంఈఓ వెల్లడిస్తూ.. శ్రామికనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హిందీ ఒకటి, మున్సిపల్ ఉన్నత పాఠశాల (జీఆర్)లో తెలుగు ఒకటి, హిందీ ఒకటి పోస్టులు ఉన్నాయని తెలిపారు.

మున్సిపల్ ఉన్నత పాఠశాల (డబ్ల్యూసీ)లో బీఎస్ రెండు, ఇంగ్లీష్ రెండు, తెలుగు మూడు, పీఈటీ ఒకటి, సోషల్ స్టడీస్ రెండు, హిందీ మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

అదేవిధంగా బీహెచ్ఎల్ 22వ వార్డు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఒకటి, నిడమర్రులోని జెడ్పీ హెచ్ఎస్ ప్లస్‌లో హిందీ ఒకటి, మంగళగిరి మున్సిపల్ యూపీఎస్ (సీఎల్ఈసీ)లో ఇంగ్లీష్ ఒకటి, బృందావన్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు ఎంఈఓ బాబు పేర్కొన్నారు.

అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# అగ్నిమాపక శాఖకు అధునాతన వాహనాలు

- రూ.40 కోట్లతో 58 ఫైర్ ఫైటింగ్ వాహనాలు ప్రారంభించిన ముఖ్యమంత్రి



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్ ):** అగ్నిప్రమాదాలు, విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు అగ్నిమాపకశాఖను మరింత ఆధునికంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన సుమారు రూ.40 కోట్ల విలువైన 58 అగ్నిమాపక వాహనాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రోడ్డులో ఫైర్ సేఫ్టీ వాహనాలకు సీఎం జెండా ఊపారు. అగ్నిమాపక శాఖ అధికారులు ఆ వాహనాల ప్రత్యేకతలను సీఎంకు వివరించారు. అలాగే గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులకు ఉపయోగపడేలా... ప్రమాద ప్రాంతాలకు వేగంగా చేరుకుని తక్షణమే అగ్నిమాపక సేవలు అందించేలా రూ.18.68 కోట్ల విలువైన 25 అధునాతన అగ్నిమాపక వాహనాలు అందుబాటులోకి వచ్చాయని అధికారులు తెలిపారు. పెద్ద అగ్నిప్రమాదాల సమయంలో నిరంతర నీటి సరఫరాకు ఉపయోగపడేలా రూ.14.79 కోట్ల విలువైన 20 వాటర్ బౌజర్లను సిద్ధంగా ఉంచుకున్నామని సీఎంకు అధికారులు చెప్పారు. ఒక్కో వాటర్ బౌజర్ 14 వేల లీటర్ల నీటిని తరలించే సామర్థ్యం కలిగి ఉంటాయని... పట్టణ, పారిశ్రామిక ప్రాంతాల్లో మంటలను అదుపు చేయడంలో ఇవి కీలకంగా వ్యవహరిస్తాయని తెలిపారు. ఇరుకైన, రద్దీగా ఉండే ప్రాంతాల్లోనూ వేగంగా చేరుకునేలా రూ.6.37 కోట్ల విలువైన 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్ ఫైటింగ్ వాహనాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించినట్టు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మొత్తం రూ.252.86 కోట్ల వ్యయంతో దశలవారీగా ఆధునిక వాహనాలు, పరికరాలను సమకూరుస్తున్నాం. తొలిదశలో రూ.33 కోట్ల వ్యయంతో 65 అగ్నిమాపక వాహనాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చాం. రెండో దశలో రూ.40 కోట్లతో 58 వాహనాలను ఇప్పుడే ప్రారంభించుకున్నాం. ఇక త్వరలో మూడో దశలోనూ మరిన్ని అగ్నిమాపక వాహనాలు, ఫైర్ ఫైటింగ్ పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నాం. వీటితో పాటు ఫైర్ స్టేషన్లల్లో మౌలిక వసతులపైనా ప్రత్యేక దృష్టి సారించాం. రాష్ట్రంలో 17 కొత్త ఫైర్ స్టేషన్ భవనాల నిర్మాణం జరుగుతుండగా, ఒక్కో భవనానికి రూ.2.25 కోట్ల చొప్పున ఖర్చు పెడుతున్నాం. వీటిలో ఆరు భవనాల నిర్మాణం పూర్తయింది. మరో 36 ఫైర్ స్టేషన్లను ఆధునీకరిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా అగ్నిమాపక సేవల మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'మీకోసం' ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం



**కొల్లూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న 'మీకోసం' ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం కొల్లూరు మండలంలో విజయవంతంగా జరిగింది. కొల్లూరు మండలంలోని ఎంపీడీవో కార్యాలయం, వేమూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కొల్లూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలను ఎమ్మెల్యే స్వయంగా కలిసి వారి సమస్యలు, వినతులు, అభ్యర్థనలను స్వీకరించారు. ప్రతి అర్జీని పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రెవెన్యూ, పంచాయతీరాజ్, తాగునీరు, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాలు, వైద్యం, వ్యవసాయం తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపించడమే 'మీకోసం (గ్రా+వా)' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగంగా, పారదర్శకంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కొల్లూరు మండలానికి చెందిన కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐక్యతే భారతదేశ ప్రతీక : ఎమ్మెల్యే నసీర్

- అందరూ కలిసికట్టు పోరాటంతో స్వాతంత్ర్యం
- స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి
- ఐకమత్యంతో విజయాలు సాధించాలి
- దేశ స్వేచ్ఛను ప్రగతికి మార్గంగా మార్చాలి
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- అంజుమన్ ఇస్లామియా ఆధ్వర్యంలో భారీ తిరంగ ర్యాలీ




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** కులమతాలకు అతీతంగా భారతావని బానిస సంకెళ్లు తెంచేందుకు ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఐక్యంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ పిలుపునిచ్చారు. శుక్రవారం అంజుమన్ ఏ ఇస్లామియా ఆధ్వర్యంలో స్థానిక అంజుమన్ విద్యార్థులతో హర్ ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే నసీర్‌తో కలిసి విద్యార్థులు జాతీయ జెండాలు చేతపట్టి వందేమాతరం నినాదాలు చేశారు. అంజుమన్ పాఠశాల నుంచి హిమనీ సెంటర్ వరకు సాగిన ర్యాలీలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ మతము ఏదైనా, భాష ఏదైనా మనందరి గుర్తింపు ఒకటే భారతీయులమని తెలిపారు. విద్యార్థులు చిన్నవయసు నుంచే శాంతి, ఐక్యతల బాటలో కలసి సాగాలని సూచించారు. స్వేచ్ఛ అనేది కేవలం ఒక హక్కు మాత్రమే కాదని, అది దేశ అభివృద్ధి పట్ల మనకున్న బాధ్యత అని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో అన్ని వర్గాల ప్రజలు తమ వంతు పోరాం చేశారన్నారు. దేశ ఆత్మగౌరవాన్ని కాపాడుతూ ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన దేశభక్తులకు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. మన ఇళ్లపై మువ్వన్నెల జెండా రెపరెపలాడుతుంటే, ప్రతి భారతీయుడి గుండెల్లో ఒక కొత్త ఉత్సాహం, బాధ్యత, దేశభక్తి కనిపిస్తుందని చెప్పారు. కులం, మతం, ప్రాంతం, భాష అనే తేడాలు లేకుండా "భిన్నత్వంలో ఏకత్వం" అనే మన భారతీయతత్వానికి ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. ఎందరో మహానుభావుల ప్రాణత్యాగాలతో సాధించిన స్వేచ్ఛను దేశ ప్రగతి కోసం ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలని సూచించారు. ప్రపంచ దేశాలు భారత దేశ ఐకమత్యాన్ని ఆదర్శంగా తీసుకుంటాయని తెలిపారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విభిన్న జాతులు, విభిన్న మతాలు, విభిన్న భాషలు ఉన్నప్పటికీ అందరిదీ ఒకటే మతమని, అదే భారతీయత అని అన్నారు.

# పటిష్ట భద్రత మధ్య స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో అమరావతి పెరేడ్ గ్రౌండ్స్‌లో భద్రత, పెరేడ్, ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకానున్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని బందోబస్తు సిబ్బందికి సూచించారు. ప్రధాన వేదిక, వీఐపీ, వీవీఐపీ, ప్రేక్షకుల గ్యాలరీలు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రభుత్వ శాఖల శకటాల ఏర్పాటు ప్రాంతాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. వాహనాల క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ నియంత్రణ, డైవర్షన్లు, వీఐపీ మార్గాల్లో భద్రతను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

వేడుకలపై ఏఐ ఆధారిత సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్ పనితీరుపై ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ మిస్బార్ భాషా నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ బి. రాజకుమారి చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్‌గా, వకుల్ జిందాల్ పోలీస్ సమన్వయ అధికారిగా వ్యవహరిస్తున్నారు. వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు ఏఎస్పీ యు. విభూ కృష్ణ పెరేడ్ కమాండర్‌గా, 14వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్. మహబూబ్ బాషా సెకండ్ ఇన్ కమాండ్‌గా, 14వ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ టి. రాఘవేంద్ర పెరేడ్ అడ్జుటెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వేడుకల్లో ఏపీఎస్పీ బెటాలియన్లు, కర్ణాటక స్టేట్ పోలీస్, సీఆర్పీఎఫ్, ఎన్‌సీసీ, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, రెడ్‌క్రాస్, ఏపీ సైనిక్ వెల్ఫేర్ శాఖ కంటింజెంట్లు పాల్గొననున్నాయి. ప్రజలు పోలీస్ అధికారులు సూచించిన పార్కింగ్ ప్రాంతాలను వినియోగించి ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని జిల్లా పోలీస్ అధికారులు కోరారు. పరిశీలనలో సీసీఎస్ ఎస్పీ సుప్రజ, అదనపు ఎస్పీలు ఏటీవీ రవికుమార్, రమణమూర్తి, ఎస్బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస, ఏఆర్ డీఎస్పీ సుంకరయ్య, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుంటూరు పశ్చిమలో రూ.3 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 24, 25వ డివిజన్లలో రూ.3 కోట్ల విలువైన రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గల్లా మాధవి శుక్రవారం శంకుస్థాపన చేశారు. 25వ డివిజన్ కొత్త కాలనీలో రూ.1.30 కోట్లు, 24వ డివిజన్ శాంతినగర్‌లో రూ.1.70 కోట్లతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కొత్తకాలనీలో 12 లైన్ల అభివృద్ధిని ప్రణాళికలో చేర్చగా, 1 నుంచి 7వ లైన్ల పనులకు శంకుస్థాపన చేసినట్లు, మిగిలిన పనులు టెండర్ దశలో ఉన్నాయని చెప్పారు. 24వ డివిజన్‌లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

గత ప్రభుత్వంలో బిల్లులు చెల్లించకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ బిల్లుల సమస్యను పరిష్కరించి పనులను పునఃప్రారంభించిందని గల్లా మాధవి అన్నారు. 25వ డివిజన్‌లో ఇప్పటికే రూ.15 కోట్ల పనులు పూర్తయ్యాయని, జమీందార్ చెరువు అభివృద్ధికి రూ.30 లక్షలతో బాక్స్ కల్వర్టు, అమృత్ పథకం కింద రూ.కోటి నిధులతో వాకింగ్ ట్రాక్, చెరువు బండ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమంతో పాటు అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు తుమ్మల నాగేశ్వరరావు, గాలం వెంకటేశ్వర్లు, కదిరి సంజయ్, మానుకొండ శివప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## కీటక జనిత వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్ ):** నాజర్‌పేట దొడ్డపనేని ఇందిరా మున్సిపల్ స్పెషల్ ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులకు కీటక జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెనాలి మలేరియా సబ్‌యూనిట్ అధికారి అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. వర్షాకాలంలో పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిల్వ ఉన్న వర్షపు నీటిలో మడ్డి ఆయిల్ లేదా వాడిన వంట నూనెను పిచికారీ చేయడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు.

ఇళ్లలో నిల్వ ఉంచిన నీటిలో డెంగ్యూ వ్యాధిని వ్యాప్తి చేసే ఏడీస్ ఈజిప్టై దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటిస్తూ వారానికి ఒకసారి నీటి నిల్వలను పూర్తిగా ఖాళీ చేయాలని సూచించారు. ఈ విషయాలను విద్యార్థులు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారికి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు శీమకుర్తి శివనాగరాణి, ఉపాధ్యాయులు ఊసపర్తి సీతారామయ్య, మలేరియా సూపర్‌వైజర్ బండారు మల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు ఆలా వేణుగోపాల్, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి తన్నీరు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని, త్రివర్ణ పతాక గౌరవాన్ని ప్రతి ఇంటికి చేర్చాలనే సంకల్పంతో గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ, నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశాలతో నగరంపాలెంలోని మూడు బొమ్మల సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని అదనపు కమిషనర్ ఐ. కిషోర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయం, ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. జాతీయ జెండా గౌరవాన్ని కాపాడుతూ నిబంధనలకు అనుగుణంగా జెండాను ఎగురవేయాలని సూచించారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటిచెప్పడం, ప్రతి ఒక్కరినీ దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఉద్దేశమని కిషోర్ తెలిపారు. నగరంలో జాతీయ జెండా ప్రదర్శనతో పాటు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబం ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమై దేశభక్తి భావాన్ని చాటాలని కోరారు. ర్యాలీలో విద్యార్థులు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఏఓ తిరుపతి నాయుడు, యూపీఏ సెల్ పీఓ సింహాచలం, మేనేజర్ బాలాజీ బాష, ఎస్ఎన్. ప్రసాద్, సీఓలు, జీఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# అవయవ దానం ప్రాణదానమే



○ నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో అవగాహన సదస్సు

**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (స్వయంప్రతిపత్తి)లో అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫార్మకాలజీ, ఫార్మసీ ప్రాక్టీస్ విభాగాలు, ఆల్ ఇండియా బాడీ అండ్ ఆర్గన్ డోనర్స్ అసోసియేషన్ , ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మణిపాల్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ ఫిజిషియన్ డా. మనోజ్ కుమార్ అవయవ దానం ద్వారా మరణానంతరం పలువురికి కొత్త జీవితాన్ని అందించవచ్చని వివరించారు. యువత అవయవ దానంపై అవగాహన పెంపొందించి సమాజంలో చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో భాగంగా అవయవ దానం ప్రాముఖ్యతను ప్రతిబింబించే ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేయగా, గుంటూరు జిల్లా ఆల్ ఇండియా బాడీ అండ్ ఆర్గన్ డోనర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం. రాధారాణి విద్యార్థులు, అధ్యాపకులతో అవయవ దాన ప్రతిజ్ఞ చేయించారు. "ఒక నిర్ణయం -- అనేక ప్రాణాలకు ఆశ" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి, సెక్రటరీ నిర్మల జ్యోతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. నరేష్ బాబు రేఖా, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విభజన విభీషికా స్మృతి దివస్‌ను స్మరించుకోవాలి

○ బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్ ):** దేశ విభజన సమయంలో జరిగిన విషాద ఘటనలను ప్రతి భారతీయుడు తప్పక స్మరించుకోవాలని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. విభజన విభీషికా స్మృతి దివస్ సందర్భంగా గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.
1947 ఆగస్టు 14న దేశ విభజనతో చోటుచేసుకున్న హింస, మారణహోమం, లక్షలాది మంది ప్రజల నిర్బంధ వలసలు, కుటుంబాల విచ్ఛిన్నం భారత చరిత్రలో ఎన్నటికీ మరచిపోలేని విషాద అధ్యాయమని పేర్కొన్నారు. ఆ దుర్ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు నివాళులర్పిస్తూ, వారి త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. విభజన విషాదం నుంచి దేశం విలువైన పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని, భారత సమైక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని మాధవ్ కోరారు. ఆనాటి చేదు జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, అమరుల త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని దేశ ఐక్యత కోసం ఐక్యంగా ముందుకు సాగడమే వారికి నిజమైన నివాళి అవుతుందని ఆయన పేర్కొన్నారు.

# వణుకూరులో ఘనంగా తిరంగా ర్యాలీ



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్ ):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పెనమలూరు మండలం వణుకూరు గ్రామంలో శ్రీ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులతో శుక్రవారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ పెనమలూరు మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు త్రివర్ణ పతాకాలను చేతబూని దేశభక్తి నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిలారు దిలీప్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దేశ సమైక్యత, సార్వభౌమత్వం, జాతీయ భావనలను ప్రజల్లో పెంపొందించడమే తిరంగా ర్యాలీల ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. స్వాతంత్ర్యం సాధించేందుకు పూర్వీకులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో దేశం పట్ల ప్రేమ, బాధ్యత, ఐక్యతను ప్రజల్లో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పెనమలూరు మండల కమిటీ సభ్యులు, మండల పదాధికారులు, జిల్లా పదాధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వీవీఐటీ, వీవీఐటీ విశ్వవిద్యాలయ విద్యార్థులు శుక్రవారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 80 మీటర్ల పొడవైన భారీ జాతీయ పతాకాన్ని చేతబూని విశ్వవిద్యాలయం నుంచి నంబూరు గ్రామం వరకు ర్యాలీ నిర్వహించారు. వీవీఐటీ ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. నంబూరు గ్రామంలో విద్యార్థులు 'భారత్ మాతాకీ జై' నినాదాలతో దేశభక్తిని చాటారు. వీవీఐ, వీవీఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు క్రీడా మైదానంలో దేశపటం ఆకారంలో నిలబడి ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలు దోహదపడతాయని వీవీఐటీయూ ప్రో-ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. కార్యక్రమంలో వీవీఐటీయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు, రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, వీవీఐ ప్రిన్సిపాల్ చదవాల సరళ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. అరుణ్‌కుమార్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# "తిరంగా మన గర్వం.. భారత ఐక్యతకు ప్రతీక"





○ తెనాలిలో ఘనంగా తిరంగా బైక్ ర్యాలీ

○ పాల్గొన్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్సీ ఆలపాటి

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్ ):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా తెనాలి పట్టణంలో శుక్రవారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ దేశభక్తి వాతావరణంలో ఘనంగా జరిగింది. చెంచుపేటలో ప్రారంభమైన ఈ ర్యాలీని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ జాతీయ జెండా ఊపి ప్రారంభించారు. తిరంగా జెండాలను చేతబట్టి నాయకులు, కార్యకర్తలు, యువకులు వందలాది బైక్‌లతో నగర వీధుల గుండా ర్యాలీ నిర్వహించి దేశ ఐక్యత, జాతీయ గౌరవాన్ని చాటిచెప్పారు.
ర్యాలీ అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ భారత జాతీయ జెండా ప్రతి భారతీయుడి ఆత్మగౌరవానికి, దేశ ఐక్యతకు శాశ్వత ప్రతీక అని అన్నారు. తిరంగాలోని కాషాయ రంగు ధైర్యం, త్యాగానికి, తెలుపు రంగు శాంతి, సత్యానికి, ఆకుపచ్చ రంగు అభివృద్ధి, సుసంపన్నతకు సంకేతమని, మధ్యలోని అశోక చక్రం ధర్మం, న్యాయం, నిరంతర ప్రగతిని ప్రతిబింబిస్తుందని వివరించారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు.
ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తిరంగా కేవలం జెండా మాత్రమే కాదని, 140 కోట్ల భారతీయులను ఏకం చేసే జాతీయ చిహ్నమని పేర్కొన్నారు. జాతీయ పర్వదినాల్లోనే కాకుండా ప్రతి సందర్భంలోనూ జాతీయ జెండా గౌరవాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. యువత దేశభక్తి, రాజ్యాంగ విలువలను ఆచరణలో పెట్టి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.
తెనాలి ప్రధాన రహదారుల మీదుగా సాగిన ర్యాలీలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాలతో "భారత్ మాతాకీ జై", "వందే మాతరం" నినాదాలతో పట్టణం దేశభక్తి సందేశంతో మార్మోగింది.

# అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి చంద్రికకు మంత్రి సత్యకుమార్



**ములకలచెరువు(జర్నలిస్ట్ ఫైల్ ):** అన్నమయ్య జిల్లా ములకలచెరువుకు చెందిన అరుదైన జన్యుపరమైన వ్యాధి జెరోడెర్మా పిగ్మెంటోసమ్ తో బాధపడుతున్న ఆరేళ్ల చిన్నారి ఎస్. చంద్రికను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. హైదరాబాదులోని ఇండో అమెరికన్ ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచితంగా మైక్రోవాస్క్యులర్ రీకన్‌స్ట్రక్షన్ శస్త్రచికిత్స చేయించేందుకు మంత్రి చొరవ తీసుకోగా, ప్రస్తుతం వైద్యుల సూచన మేరకు ఇంటివద్ద కోలుకుంటున్న బాలిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. చంద్రిక ఆరోగ్య సమస్య గురించి తెలిసిన వెంటనే జిల్లా వైద్యాధికారులను ఇంటికి పంపించి పరీక్షలు నిర్వహింపజేసిన మంత్రి, అనంతరం తిరుపతి రుయా ఆస్పత్రికి, అక్కడి వైద్యుల సిఫార్సుతో బసవతారకం ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. తాజాగా జిల్లాల పర్యటనలో భాగంగా అదే మార్గంలో వెళ్తూ బాలిక ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్య పురోగతిపై వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన వైద్య సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.

# మొండిగేట్ సమస్యకు శాశ్వత పరిష్కారం : కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

○ రూ.6.23 కోట్లతో ఆధునికీకరణ పనులు.. ఎమ్మెల్యే నసీర్‌తో కలిసి శంకుస్థాపన



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు నగర తూర్పు నియోజకవర్గంలో దశాబ్దాలుగా ప్రజలను వేధిస్తున్న మొండిగేట్ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రైల్వే శాఖ నుంచి సమకూర్చిన రూ. 6.23 కోట్ల నిధులతో చేపట్టనున్న మొండిగేట్ ఆధునికీకరణ పనులకు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ గుంటూరు నగరం నుంచి వెలువడే మురుగునీరు పీకలవాగు, మొండిగేట్ తదితర ప్రాంతాల మీదుగా బయటకు వెళ్తోందన్నారు. ప్రస్తుతం మొండిగేట్ గేటు ద్వారా సగటున 30 వేల లీటర్ల డ్రైనేజీ నీరు బయటకు వెళ్తున్నప్పటికీ భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు, మురుగునీరు కలిసి పొంగి ఇళ్లలోకి చేరుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తాను, ఎమ్మెల్యే నసీర్ స్వయంగా పరిశీలించామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న సామర్థ్యాన్ని 30 వేల లీటర్ల నుంచి 50 వేల లీటర్లకు పెంచితేనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గుర్తించినట్లు తెలిపారు. ఇందుకు సుమారు రూ. 7-8 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసి, అధికారులతో చర్చించి రైల్వే శాఖ నుంచి నిధులు సమకూర్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. రైల్వే శాఖ సానుకూలంగా స్పందించడంతో పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. 40-50 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్య పరిష్కారమైతే మొండిగేట్ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ నీటి కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలతో పాటు పంట పొలాల యజమానులకు కూడా ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. రాజీవ్ గృహకల్ప, గొట్టాల రోడ్డు, వెంకటరామా థియేటర్, జియాద్దీన్ నగర్ ప్రాంతాల్లో ఒక్కో చోట సుమారు రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.
ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ పాత గుంటూరు ప్రజలు ఎదుర్కొంటున్న మొండిగేట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు. నగరం నుంచి వస్తున్న మురుగునీరు మొండిగేట్ వద్దకు చేరుతున్నప్పటికీ సజావుగా పారుదల కాకపోవడంతో పొంగి బయటకు వస్తోందన్నారు. అధికారులతో చర్చించిన అనంతరం సమస్య పరిష్కారానికి భారీగా నిధులు అవసరమని గుర్తించి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.
పాత గుంటూరు ప్రాంతంలోని 50 వేలకుపైగా కుటుంబాలకు ఈ ఆధునికీకరణతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. సబ్‌స్టేషన్, నందివెలుగు ఆర్వోబీ, మొండిగేట్ ఆధునికీకరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు నిలిచిపోయిన పరిస్థితి నుంచి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. కేంద్ర మంత్రి సహకారంతో రూ. 48 కోట్ల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.
రైల్వే అదనపు డీఆర్ఎం రమేష్ మాట్లాడుతూ మొండిగేట్ డ్రైనేజీ వ్యవస్థను 1.2 నుంచి 1.3 మీటర్ల పరిమాణంలో ఆధునికీకరించి, అదనంగా 25 క్యూమిక్స్‌కు పైగా డ్రైనేజీ నీటిని విడుదల చేసే సామర్థ్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణానికి అవసరమైన నిధులు ఈ ఏడాదే మంజూరయ్యాయని చెప్పారు. వర్షాకాలం పూర్తయిన అనంతరం మిగిలిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. డ్రైనేజీలో అనవసర వ్యర్థాలు చేరకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.
కార్యక్రమంలో బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు యాదయ్య వెంకటేశ్వరరావు, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, మాజీ డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్, మాజీ కార్పొరేటర్లు ఎల్లావుల అశోక్, మీరావలి, చిష్టి, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలపై సీఎం చంద్రబాబుతో ఆగస్టు మూడో వారంలో భేటీ

○ పీఆర్సీ, డీఏ, ఐఆర్‌పై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలి

○ అవసరమైతే ఉద్యమ కార్యాచరణ ఏపీజేఏసీ చైర్మన్, ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్ల ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు మూడో వారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశం జరిగే అవకాశం ఉందని ఏపీజేఏసీ చైర్మన్, ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ తెలిపారు. వెలగపూడి సచివాలయంలో శుక్రవారం జరిగిన ఏపీజేఏసీ నాయకుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.
ఉద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రితో జరిగే సమావేశంలో జేఏసీ రాజీలేని వైఖరితో వ్యవహరిస్తుందని విద్యాసాగర్ స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు పీఆర్సీ, డీఏ, ఐఆర్‌తో పాటు ఇతర ఆర్థిక అంశాలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరనున్నట్లు చెప్పారు. పెరుగుతున్న ధరల కారణంగా ఉద్యోగుల ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ క్లిష్టంగా మారుతోందని, సామాన్య ఉద్యోగి ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రధాన డిమాండ్లు ఇవే...**

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్న ప్రధాన అంశాలను విద్యాసాగర్ వెల్లడించారు. వాటిలో పీఆర్సీ, ఇంటరిమ్ రిలీఫ్, పెండింగ్ డీఏల విడుదల, సరెండర్ లీవ్ నగదీకరణతో పాటు ఇతర బకాయిల చెల్లింపు, ఉద్యోగుల హెల్త్ కార్డుల సమస్య పరిష్కారం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపు, పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ మంజూరు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు ఉన్నాయి.
అదేవిధంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అమలు, సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు, అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్-1లో చేర్చడం, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కూడా ప్రభుత్వం ముందు ఉంచనున్నట్లు తెలిపారు.

**అవసరమైతే ఉద్యమ కార్యాచరణ**

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల ప్రయోజనాల పరిరక్షణ కోసం అవసరమైతే తగిన కార్యాచరణ చేపట్టేందుకు ఏపీజేఏసీ సిద్ధంగా ఉందని విద్యాసాగర్ పేర్కొన్నారు. సంఘాల నాయకులు, ఉద్యోగులు సమిష్టిగా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

**ఆగస్టు చివరిలో రాష్ట్రస్థాయి సమావేశం**

తాలూకా నుంచి జిల్లా స్థాయి వరకు నూతన కార్యవర్గాల ఎన్నికలు పూర్తయ్యాయని, ప్రస్తుత పరిస్థితులు, ఉద్యోగుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర చర్చ కోసం ఆగస్టు చివరి వారంలో విజయవాడలో ఏపీజేఏసీ విస్తృత రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జేఏసీ సెక్రటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్, ఫ్యాప్టో చైర్మన్ సాయి శ్రీనివాస్, ఏపీఎన్జీవోస్ ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు జి. హృదయరాజు, పీఆర్టీయూ అధ్యక్షుడు మిట్ట కృష్ణయ్య, ఏపీఎస్ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు శ్రీనివాస్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో హడావుడి వద్దు : ఏపీ జేఏసీ అమరావతి

○ సీనియారిటీ ప్రాతిపదికగా కేటాయింపులు చేయాలి

○ పదోన్నతులపై బ్యాన్ ఎత్తివేసి ఆగస్టు 31 వరకు అవకాశం కల్పించాలి : ఏపీ జేఏసీ అమరావతి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రపతి ఉత్తర్వులు--2025 అమలు ప్రక్రియలో ఉద్యోగుల హక్కులను పరిరక్షిస్తూ, సీనియారిటీనే ప్రధాన ప్రాతిపదికగా తీసుకుని పారదర్శకంగా అమలు చేయాలని ఏపీ జేఏసీ అమరావతి ప్రభుత్వాన్ని కోరింది. జాబ్ క్యాలెండర్ విడుదల పేరుతో పదోన్నతులపై విధించిన బ్యాన్‌ను వెంటనే ఎత్తివేసి ఈ నెల 31 వరకు పదోన్నతులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేసింది.
ఉద్యోగులను స్థానిక క్యాడర్లకు కేటాయించే అంశంపై సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు నాయకత్వంలో జేఏసీ సభ్య సంఘాల ప్రతినిధులు హాజరై రాష్ట్రపతి ఉత్తర్వుల అమలుపై తమ సూచనలు ప్రభుత్వానికి అందజేశారు.

**27 నెలల గడువును వినియోగించుకోవాలి**

సమావేశంలో బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రపతి ఉత్తర్వుల అమలు అనేది కేవలం ఉద్యోగుల కేటాయింపుల ప్రక్రియ మాత్రమే కాదని, భవిష్యత్ తరాల ప్రభుత్వ ఉద్యోగుల సేవా నిర్మాణంపై దీర్ఘకాలిక ప్రభావం చూపే కీలక పరిపాలనా ప్రక్రియ అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కల్పించిన 27 నెలల గడువును సముచితంగా వినియోగించుకుని చట్టబద్ధంగా, సమగ్రంగా, హడావుడి లేకుండా ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు.
రాష్ట్రపతి ఉత్తర్వులలోని పారా 4(2)ను ఆచరణాత్మకంగా అమలు చేయాలంటే సీనియారిటీనే ప్రాతిపదికగా తీసుకోవాలని, ఉద్యోగుల న్యాయమైన హక్కులు దెబ్బతినకుండా అన్ని శాఖల్లో ఒకే విధానాన్ని అనుసరించాలని సూచించారు.

**పదోన్నతులు, కారుణ్య నియామకాలు నిలిచిపోయాయి**

జూలై 13 నుంచి పదోన్నతులపై ప్రభుత్వం విధించిన బ్యాన్ కారణంగా అనేక శాఖల్లో పదోన్నతులు పూర్తిగా నిలిచిపోయాయని జేఏసీ ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో పాటు కారుణ్య నియామకాలు కూడా నిలిచిపోవడం వల్ల అర్హులైన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొంది. గత ఏప్రిల్ 26న జరిగిన సమావేశంలో ఇదే అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఆర్థిక శాఖ నుంచి ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించింది. బ్యాన్ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకుని ప్రస్తుత ప్యానెల్ ఇయర్ చివరి తేదీ అయిన ఆగస్టు 31 వరకు పదోన్నతుల ప్రక్రియ కొనసాగించేందుకు అనుమతించాలని డిమాండ్ చేసింది.

**మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి**

మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులకు ఇప్పటికీ ప్రత్యేక సర్వీస్ రూల్స్ లేకపోవడం దురదృష్టకరమని జేఏసీ పేర్కొంది. ప్రస్తుతం హైదరాబాద్ కార్పొరేషన్ సర్వీస్ రూల్స్ ఆధారంగా సేవా వ్యవహారాలు కొనసాగడం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడింది.
ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం. 135లో నియామక అధికారాన్ని ఆర్‌డీడీకి బదిలీ చేయడం పురపాలక చట్టాలకు విరుద్ధమని పేర్కొంటూ, ఆ జీఓకు సవరణ ఉత్తర్వులు జారీ చేసిన తర్వాతే మున్సిపల్ శాఖలో రాష్ట్రపతి ఉత్తర్వులు అమలు చేయాలని కోరింది.

**దివ్యాంగుల హక్కులను పరిరక్షించాలి**

ప్రిఫరెన్స్ జాబితాలో 70 శాతం వైకల్యం ఉన్న ఉద్యోగులకే ప్రాధాన్యం కల్పించడం దివ్యాంగుల హక్కుల చట్టం--2016 కు విరుద్ధమని జేఏసీ అభిప్రాయపడింది. దివ్యాంగ ఉద్యోగుల హక్కులను దృష్టిలో ఉంచుకుని అర్హతను 40 శాతానికి తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరింది.
అలాగే తుది సీనియారిటీ జాబితాలను ఖరారు చేసే ముందు ఉద్యోగులకు కనీసం 15 రోజుల పాటు అభ్యంతరాలు సమర్పించే అవకాశం కల్పించాలని, రాష్ట్రపతి ఉత్తర్వుల పరిధిలోకి రాని సేవా అంశాలను అనవసరంగా నిలిపివేయకూడదని సూచించింది.

**శాఖల వారీ కార్యాచరణ ప్రణాళిక అవసరం**

ప్రతి శాఖలో కేడర్ బలం, సీనియారిటీ, ఖాళీలు, పదోన్నతులు, ఇతర సేవా సమస్యలను సమగ్రంగా గుర్తించి సంబంధిత శాఖాధిపతులు, గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలతో సంప్రదింపులు జరిపి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఉద్యోగుల హక్కులను పరిరక్షిస్తూ చట్టబద్ధంగా, పారదర్శకంగా రాష్ట్రపతి ఉత్తర్వులు-2025ను విజయవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది.
ఈ సమావేశంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, ఏపీ కోఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు, ఏపీ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్టే తిమ్మసర్తి నాగేశ్వరరావు, జేఏసీ మహిళా విభాగం చైర్‌పర్సన్ పి. లక్ష్మీ, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467